ప్రజాశక్తి ఆదివారం అనుబంధం
జూన్ 7, 2009
ఋతుపవనాలు
జీవన తరంగాలు...

# హ్యాపీబర్త్‌డే

(2009 జూన్ 7 నుంచి
2009 జూన్ 13 వరకు)

కె. ప్రభాత్
5సం॥,జూన్-2004
నిర్మల-హరికిషోర్
బాగ్‌లింగంపల్లి-హైదరాబాద్

శ్రీనివాస్ శ్రీకర్
1సం॥, జూన్-2008
సంతోషి-కిరణ్‌కుమార్
విశాఖపట్నం

కె. మానస-మాధురి
11సం॥, జూన్-10
లక్ష్మి-వెంకటేశ్వరరావు
బుర్హాన్‌పురం-ఖమ్మం

ఎన్. నిఖిల్
1సం॥, జూన్-2008
మౌనిక-పాండురంగయ్య
జడ్చర్ల-మ॥నగర్

పి. సాయిలక్ష్మీప్రవల్లిక
6సం॥, జూన్-8
శ్రీదేవి-చక్రవర్తి
కూకట్‌పల్లి-హైదరాబాద్

ఇలియాస్
1సం॥, జూన్-2008
ఖాజాబీ-రుక్ముద్దీన్
పాణ్యం-కర్నూలు

ఎస్. కావ్య
5సం॥, మే-2004
ఉషారాణి-కృష్ణమోహనరావు
ఏలూరు

పి.వి.వి.స్వరాజ్
4సం॥, జూన్-2005
శైలజ-శ్రీనివాస్
పెద్దవాల్టేరు-విశాఖపట్నం

వాహిని(బంగారం)
1సం॥, జూన్-10
నవత-నాగరాజ్
అశోక్‌నగర్-కరీంనగర్

తన్మయ్
జూన్
భాగ్యలక్ష్మి-శ్రీశైలం
కామాక్షిపురం-హైదరాబాద్

ఎస్. చైతన్యమానవి
5సం॥,జూన్-7
శ్రీలత-మధుసూదనరావు
విజయనగరం

అగస్త్య
1సం॥, జూన్-8
సుప్రజ-రాఘవేందర్
ఎఎస్‌రావు నగర్-హైదరాబాద్

కె. రవితేజ
7సం॥, జూన్-7
అరుణ-సూరిబాబు
జుత్తాడ-విశాఖపట్నం

స్వర్ణభారతి
2సం॥, జూన్-2007
నర్సమ్మ-వెంకటనర్సరాజు
రొంపిచర్ల-గుంటూరు

కె. మణీశ్వర్‌రెడ్డి
2సం॥, జూన్-2007
అరుణ-వీరారెడ్డి
ఉప్పల్-హైదరాబాద్

పి. శిరీష
1సం॥, జూన్-11
రాజ్యలక్ష్మి-వీరప్రతాప్
ఏలూరు

మనలో మాట

# చాదస్తం

"ఇందుమూలంగా తెలియచేయునది ఏమనగా...ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా మన పిల్లలను పట్టుకుపోయేవాళ్లు వస్తున్నారహో...ఈసారైనా మన పిల్లలను జాగ్రత్తగా కాపాడుకుందామహో. ప్రతి ఒక్కరూ తమ చిన్నారి చేపలను తీసుకుని మన రహస్య స్థావరానికి రావలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నామహో...." చెరువంతా తిరగాడుతూ చేతిమైకులో ఓ చేప చెప్పకుంటూ పోతోంది.

దాంతో చెరువులో వున్న వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. సరిగ్గా పది నిముషాల్లో చెరువులో అంతా నిశ్చలం.. నిశ్శబ్దం...కాదు కాదు నిర్మత్స్యం. చెరువులోని పేద్ద రాతికింద చేపలన్నీ సమావేశమయ్యాయి. అన్నిట్లోకి ముసలి చేప ఓ బుల్లి రాతిమీద గంభీరంగా కూర్చుంది. చాలాసేపటి తర్వాత గొంతు సవరించుకొని "మళ్లీ మృగశిరకార్తె వస్తోంది. అది వచ్చిందంటే మనకు ముఖ్యంగా మన పిల్లలకు ప్రాణ గండమే. చెప్పీ చెప్పీ నోళ్లు నొప్పెడుతున్నాయి కానీ మనుషుల్లో చేపముల్లు మొనంత కూడా మార్పు రావడం లేదు. అందుకు మన వంశాంకురాలు బలైపోతున్నారు..." అంటుండగానే...

"అసలు ఆ మనుషులు మమ్మల్నే ఎందుకు పట్టుకెళుతున్నారో తెల్సుకోవచ్చా..." అంది ఓ నల్ల చేప పిల్ల!

ఎర్రచేప ఒకటి కళ్లజోడు సరిచేసుకుంటూ... "చిన్నారీ...మనుషులు తరతరాలుగా ఉబ్బసంతో బాధపడుతున్నారు. అది వారిని చావనివ్వదు. బ్రతకనివ్వదు. కూర్చోనివ్వదు. పడుకోనివ్వదు. తిననివ్వదు...తాగనివ్వదు. దగ్గు...బుస. మన నోట్లో మందు పెట్టి అమాంతంగా మనల్ని మింగేస్తే ఉబ్బసం తుగ్గుతుందని జనం అపోహ. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా ఆస్తమా రోగులు ...హైదరాబాదు నగరానికి చేరుకుంటారు. ఎంతమందికి మందు వేస్తే అన్ని చేప పిల్లలు కావాలి. అందుకే మీలాంటి చిన్నారులను ఎత్తుకుపోతారమ్మా ఆ మాయదారి మనుషులు" అంది.

"ఎన్నో ఆస్పత్రులు, ఎన్నో రకాల మందులు. ఎంతోమంది డాక్టర్లుండగా మనల్ని సజీవంగా మింగడమెందుకు? అసలు మందు ఇచ్చే వారు డాక్టర్లేనా?!"

"అదో నమ్మకం తల్లీ! మందు ఇచ్చేవారు డాక్టర్లు కారు. పుచ్చుకునేవారంతా రోగులు కారు. రోగం వున్నా లేకున్నా మంత్రులు, ముఖ్యమంత్రులు కూడా వెళ్లి మందు వేయించుకుంటారమ్మా...ఎద్దు ఈనిందంటే దూడను కట్టేయమంటారు. అంతా పబ్లిసిటీ దురద తల్లీ..."

"అసలు ఆ మందు దేంతో తయారుచేస్తారో చెప్పినవారు లేరుగదా..." ప్రశ్నించింది మరో చేప.

"లేరు తల్లీ. అక్కడికీ జనవిజ్ఞానవేదిక వారు చేపమందులో ఉబ్బసాన్ని తగ్గించే మందు లేదని, అది అశాస్త్రీయమని నెత్తీనోరూ బాదుకుని చెప్తూనేవున్నారు. చివరాఖరకు హైకోర్టును కూడా ఆశ్రయించారు. చేపమందు శాస్త్రీయమో కాదో నిగ్గుతేల్చమని కోరారు. దాంతో చేపమందు శాంపిళ్లను న్యూఢిల్లీ, కలకత్తాలోని పరిశోధనాశాలలకు పంపగా... ఆస్తమాను తగ్గించే మందులేవీ అందులో లేవని తేలింది. అప్పుడుకానీ ఆ మందు ఇచ్చేవారు దిగిరాలేదు. తాము ఇచ్చేది చేపమందు కాదని..ప్రసాదమని చెప్పకొచ్చారు. ఫలితంగా చేపమందుకోసం వచ్చేవారి సంఖ్య తగ్గినా...ఇంకా వస్తూనే వున్నారు. తింటూనే వున్నారు. అయినా పిచ్చికాకపోతే ... సముద్రంలోపడి కొట్టుకుపోయేవారికి గడ్డిపోచ దొరికిందనుకో...అది తమను కాపాడకపోతుందా అని ప్రయత్నిస్తారు. అంతమాత్రాన గడ్డిపోచ వారిని కాపాడదుకదా. ఆస్తమాతో బాధపడేవారు చేపమందు తీసుకోవడంకూడా అంతేనమ్మా...ఒట్టి నమ్మకమే"

"ఈ విషయం వారికెప్పుడు తెలుస్తుందో ఏమో!"

★

## ఈ సంచికలో....


| | | |
|---|---|---|
| టపా | ... | 2 |
| తెల్సా | ... | 3 |
| గని | ... | 6 |
| రుచి | ... | 8 |
| బాల నేస్తాలు | ... | 12 |
| అట్టమీది కథ | ... | 14 |
| కవిత్వమ్ | ... | 17 |
| క్రైమ్‌కథ | ... | 20 |
| ఆరోగ్యం | ... | 21 |
| చూద్దామా | ... | 22 |
| కొత్త పుస్తకాలు | ... | 24 |


### ఇంకా...

స్ఫూర్తి ... 4
ప్రాణ స్పందన

సమ్‌థింగ్ స్పెషల్ ... 9
'పాజిటివ్' పెళ్లిళ్లు

కథ ... 10
దంతపు దువ్వెన

విజ్ఞాన వీచిక... 18
కాలుష్యం
ఎంత కఠినం?!

## సందర్భోచితం

**మే** 24 ఆదివారం సంచికలో అట్టమీది కథ 'మళ్లీ మన్మోహనీయం' వ్యాసం సమయానుకూలంగా ఉంది. వారి వ్యక్తిగత , రాజకీయ పరిజ్ఞానం వినదగినది. జవహర్‌లాల్ నెహ్రూ తర్వాత రెండవసారి ప్రధానిగా ఎన్నికైన నిండుమనిషి. నేడు దేశాన్ని పట్టి పీడిస్తున్న అధిక ధరలకు కళ్లెం వేసి సామాన్యులకు వెసులుబాటు కలిగించడం ప్రధాన కర్తవ్యం.

**ఆచార్య నూతి నారాయణరావు,**
**హైదరాబాద్.**

## ఆద్యంతం ఆకట్టుకుంది

**'మళ్లీ** మన్మోహనీయమే' కవర్ స్టోరీ ఆద్యంతం ఆకట్టుకుంది. ఆర్థిక సంస్కరణలకు, ఆర్థిక మాంద్యానికి ప్రపంచ దేశాలు కుదేలవుతున్న సమయంలో మన్మోహనుడు రెండవసారి ప్రధాని కావడం హర్షించదగ్గది. అయితే సంస్కరణలను మరింత ముందుకు తీసుకెళ్లగలరన్న గ్యారంటీ లేదు. దాని ప్రభావం మన మీద ఎలా వుంటుందో ఏమో!

**బిక్కనూరు రాజేశ్వర్,**
**పొన్కల్, ఆదిలాబాద్.**

## కవర్ స్టోరీ బాగుంది

**భా**రత దేశ ప్రధానిగా డాక్టర్ మన్మోహన్ సింగ్ మరోసారి ప్రమాణ స్వీకారం చేయడం అభినందనీయం. మితభాషి, ఆర్థికవేత్త, ఆర్థిక శాస్త్ర కౌశలం అందరికీ తెలిసిందే. ఆర్థిక మంత్రిగా ఉదారవాద విధానాలు, సరళీకరణ విధానాలు తీసుకొనేటప్పుడు ఎంతో మెలకువగా వ్యవహరించక తప్పదు. రెండు సార్లు ప్రధానమంత్రి అయిన ధీశాలి, రాజనీతిజ్ఞుడు అయిన మన్మోహన్‌సింగ్ అభినందనీయుడు. అదే సమయంలో సామాన్యుల ఇక్కట్లను కడతేర్చ గలిగితే సరి. లేకపోతే మళ్లీ ప్రతిపక్షమే గతి.

**బుర్రి కుమారరాజు, రత్నపురి**
**కాలనీ, గుంటూరు.**

## చదివి...సినిమా చూడాలనుకున్నాం

**మే** 24 నాటి స్నేహ అట్టమీది కథగా మళ్లీ మన్మోహనీయం ఆసక్తికరంగా ఉంది. దిద్దుకోలేని తప్పు కథ బాగుంది. సినిమా కబుర్లు చదివాక "నింగి... నేల... నాదే" సినిమా చూడాలని నిశ్చయించుకున్నాం. క్యాట్ ఉమెన్ ఉదంతం చదివాక అందమైన రూపం పోగొట్టుకున్న జోసిలిన్ వైల్డ్‌స్టైన్ పరిస్థితిని చూసి అయ్యో అనుకున్నాం. 'ఆరోగ్యం'లో తలనొప్పి రకాల గురించి అవగాహన చేసుకున్నాం. విజ్ఞాన వీచికలో చెప్పినట్టుగా ప్రకృతిని పరిరక్షించాల్సిన అవసరం ఎంతో ఉందనిపించింది. బాల నేస్తాలు లో కొత్తపదాలు రాద్దామా, నేర్చుకుందాం అంశాలు బాగా నచ్చాయి. కూల్‌కూల్‌గాలో మజ్జిగ అమృతప్రాయమైన పానీయమని తెలుసుకున్నాం. గని సీరియల్ ఆసక్తికరంగా సాగుతోంది. కొత్త పుస్తకాల ద్వారా అనేక పుస్తకాల పరిచయ భాగ్యం కలుగుతోంది. మనలోమాట గా... జీవితంలో ఆరాటాలు, ఆశలు, కొత్త లక్ష్యాలు ఎల్లప్పుడూ మన ఎదుట సిద్ధంగా ఉంటాయి అన్నట్లు పెద్దలెప్పుడూ పిల్లల్తో స్నేహితుల్లా వ్యవహరించాలి.

**నేమాన సుభాష్ చంద్రబోస్,**
**ఇలిసిపురం, శ్రీకాకుళం.**

## స్ఫూర్తినిచ్చిన 'నింగి...నేల...నాదే'

**ఈ** వారం కవర్ స్టోరీగా వచ్చిన మళ్లీ మన్మోహనీయం లో మన ప్రధాని మన్మోహన్‌సింగ్ గురించి విపులీకరించినందుకు ధన్యవాదాలు. చివరి పేజీలో ఇచ్చిన జోసిలిన్ వైల్డ్‌స్టైన్ ఫొటోలు చూసి ఆశ్చర్యం, అసహ్యం కలిగింది. ఇలాంటి ఫొటోలకు బదులుగా ఏమైనా తమాషాగా ఉండేవాటిని పెడ్తే బాగుంటుంది అనిపించింది. సినిమా కబుర్లలో నింగి... నేల... నాదే చాలా బాగుంది. ఇలాంటివి ఎంతో స్ఫూర్తినిస్తాయి. గని సీరియల్ బాగుంది.

**అబ్బరాజు విష్ణుప్రియ, ఎర్ర**
**మంజిల్ కాలనీ, హైదరాబాద్.**




## దేశ హితానికి పాటుపడితే చాలు

**ఈ** వారం కవర్‌స్టోరీలో ప్రధాని మన్మోహన్‌సింగ్ తీరుతెన్నులను బాగా వివరించారు. మంచో చెడో మితవాదానికి చేయూతనిచ్చే ప్రభుత్వం మరలా వచ్చింది. ప్రపంచ బ్యాంకు చుట్టమైన మన మోహనుడు ...దేశ హితానికి సంస్కరణలు అమలు చేస్తే అదే పదివేలు.

**వాస్తు రామచంద్ర,**
**రాంజీ నగర్, నెల్లూరు.**




## కథలకు ఆహ్వానం

**మన చుట్టూ అనేక సంఘటనలు జరుగుతుంటాయి. వీటిలో ఎన్నో సంఘటనలు మనసును మెలిపెడుతుంటాయి. అవి సామాజికమైనవి కావచ్చు. ఆర్థికమైనవి కావచ్చు. మరేవైనా కావచ్చు. వాటిని ప్రతిబింబించే... బాధితులను చైతన్యపరిచే... సామాజిక స్పృహ కలిగించే... కథలను మాకు పంపండి. ప్రచురిస్తాం. ఆకర్షణీయమైన పారితోషికం వుంటుంది. అయితే తెల్లకాగితం మీద ఒకవైపు మాత్రమే రాయాలి. రాతలో ఏడు కాగితాలకు మించకూడదని మనవి.**

మా చిరునామా:
కథ శీర్షికకు, ఆదివారం అనుబంధం, ప్రజాశక్తి, మోటూరు హనుమంతరావు భవన్, 21/1, ఆజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, హైదరాబాదు.

# తెలుసా!

## ధర్మామీటర్ పక్షి



ఆస్ట్రేలియాలో ఎక్కువగా కన్పించే బ్రష్ టర్కీ పక్షి ఉష్ణోగ్రత తెలుసుకోగల జీవులలో కెల్లా ప్రసిద్ధి పొందింది. ఆడ బ్రష్ టర్కీ పక్షి తన గుడ్ల చుట్టూ మట్టితో గూడు నిర్మిస్తుంది. ఈ గుడ్లను పొదిగి పిల్లలు చేయడానికి ఆరు నెలలు పడుతుంది. ఈ కాలంలో ఆడపక్షి గుడ్లు పొదగడానికి అవసరమైన 33 డిగ్రీల సెంటీగ్రేడ్‌ను హెచ్చుతగ్గులు లేకుండా చూస్తుంది. పగలు కానీ రాత్రి గానీ, మేఘావృతంగా వున్నా, బాగా ఎండగా వున్నా వాతావరణం చల్లగా వున్నా నిప్పులు చెలరేగుతున్నా గూడు లోపల 33 డిగ్రీ సెంటీగ్రేడ్ పెరగకుండా, తగ్గకుండా ఇది చూస్తుంది. గూడు చుట్టూ చిన్న చిన్న రంధ్రాలు నిర్మించి వాతావరణంలోకి హెచ్చు తగ్గుల ప్రకారం గుడ్లను కదుపుతూ ఈ పక్షి నాలుక ధర్మామీటరు వలే పనిచేస్తుంది. దాని సాయంతో అది ఉష్ణోగ్రతను గమనిస్తూ తన ముక్కును లోనికి జొనిపి గుడ్లను కదుపుతూ ఉష్ణోగ్రత సమానంగా వుండేటట్లు చూస్తుంది.

## టిప్పూస్ టైగర్



మైసూర్‌ను పాలించిన వారిలో టిప్పుసుల్తాన్‌కు ప్రత్యేక స్థానముంది. ఆయన వద్దనున్న ఒక పులి బొమ్మ అత్యద్భుత కళాఖండంగా పేరొందింది. దీనికే టిప్పూస్ టైగర్ అనే పేరు. వెల్లకిలా పడివున్న ఒక బ్రిటిష్ సైనికుని పైకెక్కి పులి తన పంజాతో మోదుతున్నట్లు సైనికుడు దిక్కుతోచక దీనంగా నిట్టూరుస్తున్నట్లు ఆ బొమ్మ వుంటుంది. 1799 టిప్పుసుల్తాన్ యుద్ధంలో ఓడిపోయిన తరువాత ఆయన ప్యాలెస్‌లోని అనేక ధన కనక వస్తువులతో సహ ఈ చెక్క పులి బొమ్మను కూడా బ్రిటీష్ వారు బ్రిటన్‌కు తరలించారు. ప్రస్తుతం ఈ కళాఖండం విక్టోరియాలోని ఆల్బర్ట్ మ్యూజియంలో ఉంది.

## వింత సాహచర్యం

వన్య ప్రాణుల్లో సింహమంటే ఒక విధమైన భయం ఉంటుంది. అయితే జీబ్రాలు, దుప్పులు కొన్ని కొన్ని సందర్భాలలో సింహం తమ సమీపానికి వచ్చినా భయపడక పోవడం, మరికొన్ని సందర్భాలలో మాత్రం భయంతో పరుగెట్టడం గుర్తించారు. అయితే ఇలా ఎందుకు జరుగుతుందని పరిశోధించడం మొదలు పెట్టిన తరువాత జంతు శాస్త్రజ్ఞులకు అసలు కారణం బోధపడింది. ఆకలి తీరిన సింహం ఎటువంటి శబ్దం లేకుండా వాటి దగ్గరకు వస్తుంది. అదే ఆకలితో ఉన్న సింహం. తన తలను కిందకి వంచి గర్జిస్తూ వేటకు బయలుదేరుతుంది. సింహం ప్రవర్తనలో ఈ తేడాను జీబ్రాలు, దుప్పులు గుర్తించడం వల్లనే అవి దాని కనుకూలంగా తమ భయాన్ని వదులుకొంటాయి.






## పెట్రోలు పంట

పశ్చిమాఫ్రికాలో చిన్న దేశమైన ఈక్వెటోరియల్ గినియాలో ఒకప్పుడు వ్యవసాయమే ఆర్థిక వ్యవస్థకు ప్రధానవనరుగా వుండేది. అయితే ప్రస్తుతం అక్కడ పెట్రోలు పంట పండుతుండడంతో వ్యవసాయం చేసేవారే కరువయ్యారు. పెట్రోలు విస్తారంగా లభ్యమౌతుండడంతో పాశ్చాత్య దేశాలకన్ను ఆ దేశంపై పడింది. ప్రస్తుతం నైజీరియా, అంగోలాల తరువాత ఆ ప్రాంతంలో పెట్రోలు సరఫరా చేసే మూడవ అతి పెద్ద దేశంగా ఈక్వెటోరియల్ గినియా వుంది. ఇది 1968 వరకూ స్పెయిన్ పరిపాలన కింద ఉండేది. విస్తీర్ణంలో మన హిమాచల్ ప్రదేశ్‌లో సగం మాత్రమే ఉన్న ఈ దేశంలో ఐదు లక్షల మంది నివసిస్తున్నారు. రాజధాని మలాబో.

# ప్రాణ స్పందన

- తెలకపల్లి రవి
సాహితీసంస్థ రాష్ట్ర కన్వీనర్,
ప్రజాశక్తి బుక్‌హౌస్ సంపాదకులు.

**ప్రాథమిక పాఠశాలలో వున్నప్పుడే కథలు చాలా ఆసక్తిగా చదివేవాణ్ని, తర్వాత ఇంటర్ చదువుతున్నప్పుడు సినిమాలలో మునిగి తేలిన రెండేళ్లు కొంత తగ్గినా నిరంతరం ఒకటికి నాలుగు పుస్తకాలు చదువుతూ వచ్చాము. బాగా ప్రభావం చూపినవీ ప్రేరణ నిచ్చినవీ చాలా వున్నాయి. వీటన్నిటిలోనూ 1974లో చదివిన 'రక్తాశ్రువులు' అనేక విధాలుగా మనసుకు హత్తుకుపోయింది.**



"**ఒ**క్క క్షణంలో వచ్చేస్తా...... నా బలహీనతను క్షమించు. కొద్ది క్షణాల్లో ఇంకిపోయే కన్నీళ్లివి.... నేను అనేక మందిని ఎరుగుదును. వాళ్లందరికంటే ఈయన విషయంలో ఇది చాలా దారుణం. ఈయన చనిపోవడమే జరిగితే ఇది రెండో తూరి. నిండా నలభై తొమ్మిది నిండలేదు. ప్రతి మనిషికి చావు తప్పదు. మనవాళ్లలో కూడా చాలామంది చనిపోయారు.మనందరికీ కూడా ఒకే జీవితం వుంది. ఒకేసారి చచ్చిపోతాం. కాని ఈయనకు అనేక జీవితాలు... పైగా ఇది మలి చావు..నీకీ సంగతి తెలుసా? ఈయన చనిపోవడం ఇది రెండవ సారి. ఈయన ఈ రెండవ మరణాన్ని గురించి విలపించడానికి చాలినన్ని కన్నీళ్లు మొత్తం చైనాలోనే లేవు"

కెనడాలో పుట్టి అత్యంత ప్రతిభావంతుడైన సర్జన్‌గా పేరొందిన బెతూన్ వ్యాధిగ్రస్తుడై మృత్యుముఖంలోకి పయనించి తన స్వీయాధ్యయనం వల్లనే కొత్త ఆపరేషన్ గురించి తెలుసుకుని బయిటపడటం, తర్వాత స్పెయిన్ అంతర్యుద్ధంలో క్షతగాత్రులకు సేవలందించడం, ఆ పైన చైనా తరలివెళ్లి లాంగ్ మార్చ్‌లో గాయపడిన వారికి చికిత్స చేస్తూ చివరకు తనే చనిపోవడం.. ఆ సందర్భంలోవే పై మాటలు. రక్తాశ్రువులు తొలి అధ్యాయం చివరిలోని పైవాక్యాలు నాపై ఎంతటి ప్రగాఢమైన ముద్ర వేశాయంటే.. " ఒక క్షణంలో వచ్చేస్తా.. నా బలహీనతను క్షమించు" అంటూ వెక్కి వెక్కి ఏడ్చే టుంగ్ మాటలు నిరంతరం గుర్తొస్తుంటాయి. ఆగని ఆ కన్నీళ్లు డాక్టర్ నార్మన్ బెతూన్ కోసం. పుస్తకం చివరలో వచ్చే ఈ భాగాన్ని మొదటే ఫ్లాష్ బ్యాక్ పద్ధతిలో చెప్పి నెమ్మదిగా ప్రజాయుద్ధ ప్రాణ ప్రదాత జీవితపు లోతుల్లోకి తీసుకుపోతారు రచయితలు. తిరిగి తిరిగి ఆ భాగంలోకి వచ్చేసరికి మనం కూడా ఆ పాత్రతో పాటు పట్టలేని దు:ఖంలో మునిగిపోయి చైనా పర్వత సానువుల్లోకి వెళ్లి బెతూన్‌కు అరుణాంజలి సమర్పిస్తాము.

ప్రాథమిక పాఠశాలలో వున్నప్పుడే కథలు చాలా ఆసక్తిగా చదివేవాణ్ని. తర్వాత ఇంటర్ చదువుతున్నప్పుడు సినిమాలలో మునిగి తేలిన రెండేళ్లు కొంత తగ్గినా నిరంతరం ఒకటికి నాలుగు పుస్తకాలు చదువుతూ వచ్చాను. బాగా ప్రభావం చూపినవీ ప్రేరణ నిచ్చినవీ చాలా వున్నాయి. వీటన్నిటిలోనూ 1974లో చదివిన 'రక్తాశ్రువులు' అనేక విధాలుగా మనసుకు హత్తుకుపోయింది.

1974లో ఇంటర్ పూర్తి చేసి డిగ్రీలో చేరాను. కమ్యూనిస్టు కుటుంబం గనక ఇంట్లో ప్రగతిశీల సాహిత్యం చాలానే వుండేది. నాన్న నరసింహయ్య కూడా సాహిత్యం బాగా చదవడమే కాక మమ్ముల్నూ ప్రోత్సహించేవారు. దానితో పాటు రోజూ జిల్లా గ్రంథాలయానికి వెళ్లి కవితా సంకలనాలు విమర్శలు పఠించేవాణ్ని. హైదరాబాద్ బుక్‌ట్రస్ట్ 1973లో మొదటిసారి ప్రచురించిన 'రక్తాశ్రువులు' కూడా ఇంట్లోనే చదివాను. అప్పటికి ఇప్పటికి బెతూన్ రూపం స్ఫూర్తి చెక్కు చెదరకుండా నిల్చిపోయాయి.

మా తాతయ్య కూడా పాతకాలం పద్ధతితో మొదలు పెట్టి ఆధునిక ఔషధాల వరకూ ఇస్తుండేవారు. అందుకే చుట్టుపక్కల వూళ్లనుంచి కూడా ఆయన కోసం పొద్దునే పెద్ద సంఖ్యలో రోగులు వేచివుండేవారు. భూస్వాములు మొదలుకుని నిరుపేదల వరకూ వచ్చేవారు. ఎవరొచ్చినా కలుపుగోలుగా మాట్లాడిస్తూ వ్యాధి తగ్గించే వారని ఆయనకు చాలా ప్రసిద్ధి. ఇక మా నాన్నకు ఎప్పుడూ ఒక గడ్డ వేధిస్తుండేది గనక దానికోసం పదే పదే ఆస్పత్రిలో చేరేవారు. అంతకు ముందు వైద్యం కూడా నేర్చుకున్నారు. కర్నూలు పెద్ద ఆస్పత్రిలో నాయకులు, కార్యకర్తలు ఎవరు చేరినా మాఇంట్లో వుండి క్యారియర్లు తీసుకెళ్లేవారు. విద్యార్థి ఉద్యమంలో మెడికల్ కాలేజీ విద్యార్థులు హౌస్ సర్జన్లుగా డ్యూటీలో వుంటూనే కబుర్లు చెబుతుండేవారు. నిజానికి నేనూ డాక్టర్ చదువుతాననుకున్నారు గాని మన శ్రద్ధాసక్తులు సరిపోలేదు. అయితే ఇవన్నీ కలిసి వైద్యరంగం పై ఆసక్తిని నిలబెట్టాయి. బెతూన్ పుస్తకం అంతగా నచ్చడానికి ఇది ఒక నేపథ్యం.

నార్మన్ బెతూన్ జీవిత గాథలో అన్నిటికన్నా మనను కట్టి పడేసేది ఆయన నిస్వార్థ దృష్టి, నిపుణత. కెనడాలోనే ప్రథమ శ్రేణినందుకుని కనకవర్షం కురిపించిన ఆయన నిరంతరం పేదల కోసమే పరితపిస్తూ వచ్చాడు. వైద్యరంగంలో వర్గ వైరుధ్యాలు ఆయనను కలవరపర్చాయి.వాటిని ప్రశ్నిస్తే ఆయనపై దుష్ప్రచారాలు సాగించారు.అయినా ఖాతరు చేయకుండా కమ్యూనిస్టుగా మారాడు. అంతర్జాతీయ ఉద్యమం ఎక్కడకు రమ్మంటే అక్కడకు వెళ్లాడు. పాచూఎ న్ అని ఆయనను ప్రేమగా పిల్చుకున్న చైనా ప్రజల తరఫున మావో సేటుంగ్ నివాళులర్పించిన తీరు నాకెప్పుడూ గుర్తుంటుంది. "పనిలో బాధ్యతారహితంగా వుంటూ ఏది చేస్తే ఎంత పేరు వస్తుందని చూసేవారికి... కర్తవ్య నిర్వహణలో మునిగిపోవడం తప్ప మరోటి తెలియని బెతూన్‌కు మధ్య తేడాను మావో గొప్పగా చెప్పారు... ఆయన నుండి మనమంతా ఆ సంపూర్ణ నిస్వార్థ సేవా చైతన్యాన్ని అలవర్చుకోవాలి. ఈ చైతన్యంలో ప్రతి ఒక్కరూ ప్రయోజనకరమైన మనిషి కాగలరు. ఒక మనిషి సామర్థ్యం అల్పమైంది కావచ్చు, అనల్పమైంది కావచ్చు. కాని అతనికీ చైతన్యం వున్నట్టయితే ఉదాత్తమైన మనస్సుతో స్వచ్ఛంగా నైతిక ధృతితో తుచ్ఛ ప్రయోజనాలకు అతీతంగా ప్రజలకు ప్రయోజనకరమైన వ్యక్తిగా ఎదిగినట్టు

భావించవచ్చు" అన్నాడు మావో. ఏ రంగంలో వున్నా నిపుణతను పెంచుకోవడం, దాన్ని సమిష్టి ప్రయోజనానికి వినియోగించడం...సంకుచితత్వాలకు అతీతంగా వ్యవహరించడం....

సాంకేతిక నైపుణ్యంలో అత్యున్నత శిఖరాలకు చేరి అంతర్జాతీయ తయారీ సంస్థలకు కూడా ఆపరేషన్ పరికరాల నమూనా సమకూర్చిన బెతూన్ చెట్టు పుట్టలు కొండ గుహల్లో అక్షర జ్ఞానం లేని జనం సహాయంతోనే అద్భుతమనదగిన ఆస్పత్రులు ఏర్పాటు చేస్తాడు. యుద్ధ రంగం నుంచి క్షతగాత్రులై వచ్చిన వారికి రోజుకు డజన్ల లెక్కన ఆపరేషన్లు చేసి బతికిస్తాడు. సామాన్యులకు తర్ఫీదునిస్తాడు. దీనికి అవసరమైన నిధులు ఔషధాల సమీకరణకు తన పరిచయాలు ఉ పయోగిస్తాడు. సరికొత్త సంబంధాలు పెంచుకుంటాడు. తనకోసం చైనా కమ్యూనిస్టు పార్టీ ఆరోగ్య రక్షణకు అవసరమైన మొత్తాన్ని కేటాయిస్తే తీసుకోనంటాడు.. ఇలా ఆ ప్రపంచ ప్రసిద్ధ సర్జన్ ప్రజాయుద్ధ సైనికుడుగా సేవకుడుగా తనను తాను సమర్పణం చేసుకుంటున్న తీరు కాస్తంతకే భేషజాలు పోయేవారికి భేషైన పాఠంగానూ అనిపిస్తుంది. ఉద్యమానికి అన్ని రకాల నైపుణ్యాలు అవసరమని అగ్రనాయకులకు తెలుసు. రష్యన్ నాటిక 'క్రెమ్లిన్ గంటలు'లో నిల్చిపోయిన గడియారాన్ని నడిపించడానికి నిపుణుడైన ఇంజనీర్‌ను తీసుకురావడానికి లెనిన్ ఎంతో ప్రాధాన్యత నివ్వడమే కాక ఆయన విమర్శలను విసుగును కూడా ఓపిగ్గా భరిస్తాడు. ప్రజాశక్తిలోనూ ఇతరత్రా కూడా బయటినుండి వచ్చిన నిపుణులను కలుసుకున్నప్పుడు సుందరయ్య గారు తదితరులు ఎంతో ఓపిగ్గా మర్యాదగా వ్యవహరించడం చూసినపుడు కూడా నాకు ఇదే భావన కలుగుతుండేది. 1977లో దివిసీమలో ఉప్పెన వచ్చినపుడు ప్రజావైద్య దళాన్ని అక్కడకు పంపించారు. కూలిపోయిన ఇళ్ళలోనూ చెట్లు పుట్టలే ఆధారంగానూ చికిత్సలందించిన నాటి వైద్య వలంటీర్లను చూస్తే బెతూన్ గుర్తుకు వచ్చాడు. డెబ్భైలలో వైద్య రంగంలో ప్రగతిశీల మిత్రులందరికీ బెతూన్ పెద్ద హీరో! ఆయనలా విదేశాలకు వెళ్లి సమరరంగంలో సేవ చేయాలని వారు కలలు కంటుండేవారు. నాలాంటి వారితో మాట్లాడుతుండేవారు. తర్వాతి కాలంలో వారిలో కొందరు నిజంగానే విదేశాలకు వెళ్లి సేవలందించారు కూడా. చాలామంది యథాశక్తి ప్రజలకు వైద్యసేవ నందిస్తున్నారు. నిలబడలేక జారిపోయిన వారు కూడా పలువురున్నారు. ఇవన్నీ చూస్తున్నప్పుడు బెతూన్ గొప్పతనం వేయింతలై కనిపిస్తుంది. పైగా ఆ నాటికి అంటే 1930లలో వైద్యం ఇంతగా అభివృద్ధి చెందలేదు. యాంటీ బయాటిక్స్ కూడా రాలేదు. బెతూన్ నుంచి నేర్చుకున్నదేమంటే వీలైనంత మెరుగైన సాంకేతిక నిపుణత సాధించవలసిందే గాని అదిలేకుంటే కుదరదని కూచోకూడదు. అవసరమా కాదా అని తప్ప సాధ్యమా కాదా అన్నది ఉద్యమంలో ప్రశ్నగా రాకూడదు. చేసే శక్తి వున్నవారు పరిమితులు పెట్టుకుని గీతల్లో కూచోకూడదు. ఆరు రోజుల్లో 126 ఆపరేషన్లు చేసి సొమ్మసిల్లిపోయిన బెతూన్ చిత్రం ఇలాంటి సందర్భాల్లో మదిలో మెదులుతుంటుంది.

బెతూన్ కథ నుంచి కొన్ని ప్రతికూల పాఠాలు కూడా నేర్చుకున్నాను. ఆయన పరిశోధనల్లో పడి పరధ్యానంగా వుండేవాడు. భార్య మాంసం తెమ్మంటే ఆయన మనిషి పేగులు తెచ్చి ఫ్రిజ్‌లో పెట్టిన ఘటన వొళ్లు గగుర్పొడిచేలా చేస్తుంది. పనిలో ఆ స్థాయి లేకపోయినా నాకూ చాలా పరధ్యానం వుంటుంది. మనం ఎంత పరధ్యానంగా వున్నా అవతలి వారిని ఆందోళన పెట్టకూడదని దీన్నుంచి నేర్చుకుని కొంత జాగ్రత్త పడుతుంటాను. అలాగే ఆయన ప్రేమించి పెళ్లాడిన ఫ్రాన్సిస్‌తో సహజీవనం చేయలేకపోతాడు. ఎవరు ఎంత గొప్ప ఆశయం కోసం పనిచేసినా జీవిత భాగస్వాములను కుటుంబ సభ్యులను కలుపుకొని పోవడానికి ప్రాధాన్యతనివ్వాలని వారికి కొంతైనా సమయం కేటాయించాలని కూడా ఈ ఉదంతం చెప్పింది. పనిలో వున్నప్పుడు బెతూన్ ఏదైనా సరిగ్గా చేయకపోతే విపరీతంగా కోప్పడతాడు. మనం కష్టపడి పనిచేయొచ్చు. కాని పని జరగనంత మాత్రాన ఇతరులపై విరుచుకుపడటం నిరర్థకమని అవతలి వారి శక్తి స్థాయి దృష్టి ఇవన్నీ గమనించి వ్యవహరించాలని అనుభవంలో గాని అర్థం కాలేదు.

రక్తాశ్రువులు ఇంతగా ఆకట్టుకోవడానికి ఆయన జీవితపు గొప్పదనంతో పాటు టెడ్ ఆడెన్, సిడ్నీ గోర్డన్‌ల రచనా శైలి కూడా కారణం. ఈ పుస్తకానికి సహవాసి అనువాదం మరో ఆకర్షణ. అరవైలలో ఒక వెలుగువెలిగి ఆరిపోయిన అనువాద కళను ఆయన మరోసారి ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లాడు. సోవియట్ యాంత్రిక అనువాదాల మధ్య పాఠకులకు ఇదో ఉపశమనంగా తోచింది. వాక్య నిర్మాణం, పదజాలం ఇలాంటి వాటికోసం కూడా ఈ పుస్తకం చదవాలి. సహవాసి అనువాదం చాలా నచ్చింది గనకే ప్రజాశక్తి సాహిత్య సంచిక గమనంలో ఈ ప్రక్రియ గురించి ఆయనతో వ్యాసం రాయించాము. ఈ పుస్తకంలో బెతూన్ తన అనువాదకుడైన టుంగ్‌ను ఎంతగానో మెచ్చుకుంటాడు. దాన్ని అనువదించలేక అతను సిగ్గుపడిపోతాడు. ఇటీవలనే సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బిపిన్ చంద్ర భగత్‌సింగ్‌పై చేసిన ప్రసంగాన్ని అనువదించినపుడు అందరూ మెచ్చుకున్నారు. ఈసారి మీరు తెలుగులో మాట్లాడాలి అని ఎవరో సరదాగా అంటే బిపిన్ వెంటనే 'తప్పకుండా. రవి సహాయంతో' అన్నారు. అలాంటి సందర్భాల్లో ఈ సన్నివేశం గుర్తొస్తుంటుంది.

**బెతూన్ కథ నుంచి కొన్ని ప్రతికూల పాఠాలు కూడా నేర్చుకున్నాను. ఆయన పరిశోధనల్లో పడి పరధ్యానంగా వుండేవాడు. భార్య మాంసం తెమ్మంటే ఆయన మనిషి పేగులు తెచ్చి ఫ్రిజ్‌లో పెట్టిన ఘటన వొళ్లు గగుర్పొడిచేలా చేస్తుంది. పనిలో ఆ స్థాయి లేకపోయినా నాకూ చాలా పరధ్యానం వుంటుంది. మనం ఎంత పరధ్యానంగా వున్నా అవతలి వారిని ఆందోళన పెట్టకూడదని దీన్నుంచి నేర్చుకుని కొంత జాగ్రత్త పడుతుంటాను.**

తెలుగు నాట ఏదో ఒక మేరకు ప్రజా వైద్యశాలల సంప్రదాయం చాలా వూళ్లలో వుంది. ఇదో ప్రత్యేకత అని ఒక సారి హరికిషన్ సింగ్ సూర్జిత్ మెచ్చుకోవడం విన్నాను. డా.రామచంద్రారెడ్డి వంటివారి వరవడీ ఇందుకు కారణం. తొంభయ్యవ దశకం తర్వాత క్రమేణా పంచనక్షత్ర వైద్యశాలలు పెరుగుతున్న కొద్దీ ప్రజావైద్యంలో ప్రభుత్వాలు బాధ్యత విస్మరిస్తున్నాయి. అయితే సంపన్న ప్రపంచం నుంచి వచ్చిన బెతూన్ 30లలోనే ఈ వైరుధ్యాన్ని గుర్తించి విమర్శించాడు. పేదలకు సేవ చేస్తే రాని పేరు ధనికుడికి చేస్తే వస్తుందని బాధపడ్డాడు.

బెతూన్ కృషికి కొనసాగింపుగా చైనా వెళ్లిన కోట్నిస్ భారతీయుడు కావడం ఎంతో గర్వకారణం. 1985లో చైనా వెళ్లినపుడు నేను కోట్నిస్ స్మారక చిహ్నం ఒకటి చూశాను. దాంతోపాటే ఆయనపై సినిమా కూడా చూపించారు. ఇక బెతూన్‌తో ఎంతో ప్రభావితుడైనాను గనక ఆయన జ్ఞాపకార్థం వెలువరించిన పోస్టల్ కవర్లు కొనుక్కొచ్చాను. అవి ఇప్పటికీ నా దగ్గర భద్రంగా వున్నాయి!

★



**జరిగినకథ:**

తివారీ కుమార్తె వివాహం ఆర్భాటంగా జరుగుతుంది. బంధువులు, స్నేహితుల ఆశీస్సుల మధ్య జరిగిన శుభకార్యం వారందరినీ సంతోషపెడుతుంది. పెళ్లికుమార్తె తరపువారు పెళ్లికుమారుడి తరపు వారిని సాదరంగా ఆహ్వానించి మర్యాదలు చేస్తారు. సాంప్రదాయ బద్ధంగా చేసే కార్యక్రమాలన్నిటినీ ఎంతో వైభవంగా జరిపిస్తారు. అయితే మరో వైపు గనిలో మరణించిన ఇద్దరిలో ఒకరి భార్య గర్భిణి. ఆమె పుట్టింటికి వెళ్లిపోతుంది. మరొకరి భార్య ముగ్గురు చిన్నబిడ్డల తల్లి. యాజమాన్యం ఈమె గురించి పట్టించుకోదు. కార్మికులూ నిలదీసి అడిగే స్థితిలో లేరు. అప్పు పుట్టిన చోటల్లా చేసి పిల్లలను ఎలాగో బతికిస్తుంది. తర్వాత ఇంట్లో వున్న వస్తువులను ఒకటొకటిగా అమ్మి పిల్లలకు తిండి పెడుతుంది. ఇంట్లో వస్తువులన్నీ అయిపోయాక పస్తులే గతవుతాయి. అలా ఎన్ని రోజులని వుంటారు! చివరికి పిల్లలకి విషం ఇచ్చి తనూ తాగి జీవితాలకు ముగింపు పలుకుతుందామె. ఈ దుర్ఘటన కార్మికులలో పెద్ద చర్చకు తెరతీస్తుంది.

ఆ తర్వాత....

తమిళ మూలం : కె. చిన్నప్పభారతి

అనువాదం : వి. వెంకటేశ్వర

(పదవ భాగం)

ఉద్యోగాన్ని ఎరగా చూపించి శ్రమను దోచుకొంటున్న యాజమాన్యాన్ని నిలదీయడం వాళ్ళ తరంగాదు. యజమానుల ఇళ్ళలోని కుక్కలు కూడా తమ కంటే మెరుగైన జీవితాన్ని అనుభవిస్తున్నాయి. వాటికి దక్కే తిండీ, అవి నివసించడానికి కేటాయించే స్థలాలూ వాళ్ళు కలలో కూడా చూడలేరు. నేతి రొట్టెలు, మాంసం వేపుళ్ళు, కోడిగుడ్లు, పాలు, ఘుమఘుమలాడే సబ్బుతో స్నానం చేయించడం, తెల్లని తువ్వాలతో తుడవడం, ఆహా- ఆ కుక్కది ఎంతటి భోగం ! ఒక పూట గంజికైనా దేవులాడుతూ మురుగుకాల్వల గట్టున పూరిగుడిసెల్లో జీవిస్తోన్న వాళ్ళు, 'కుక్కనైనా కాకపోతిని రాజభోగములనుభవింపగా' అని పాడుకోవడంలో వింతేముంది. పెంపుడు కుక్కల జీవితాలే ఇలా ఉండగా, యజమానుల జీవితాలు ఎంత విలాసవంతంగా ఉంటాయో కదా! తమకు తాము మనుషులుగా భావించలేని స్థితిలో మానవహక్కుల గురించి ఏమాలోచిస్తారు? తమ అభిప్రాయాలేం తెలియజేస్తారు? ఆకలి బాధ తీరడానికి ఆహారమే స్వీకరించాలని నిర్ణయించుకొన్నారు.

అయితే, వాళ్ళలో అసంతృప్తి తాలూకు లావా కుతకుతలాడుతూనే ఉంది. తమ కష్టసుఖాలనూ బికాస్‌కు వివరించి, పరిష్కార మార్గం చూపించమని అతడ్ని కోరడంతో అది బహిర్గతమైంది. అతడి సూచన మేరకు రహస్యంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసరుకు ఓ వినతిపత్రం పంపారు. అతడు యాజమాన్యం గుప్పిట్లోని మనిషిని వాళ్ళకు తెలియదు. వినతిపత్రం అందగానే సదరు ఆఫీసరు తమకు న్యాయం చేకూర్చుతాడన్నదే వాళ్ళు వినికిడి ద్వారా గ్రహించిన విషయం.

యాజమాన్యం వారి ఆనుపానులన్నీ బికాస్‌కు తెలుసుగానీ, తన అభిప్రాయం వెల్లడిస్తే కార్మికులు అయోమయంలో పడిపోతారన్న ఆలోచనతో అతడు మౌనం వహించాడు. యాజమాన్యం వారి దురాలోచనల్ని అనుభవపూర్వకంగా తెలుసుకొన్నప్పుడే కార్మికులు ఎటువంటి సంఘర్షణకైనా మానసికంగా సన్నద్ధులవుతారని కూడా అతడు భావించాడు.

యాజమాన్యమూ, కార్మికులూ కుదుర్చుకొన్న ఒప్పందం అమల్లోకి వచ్చింది. రేషన్ మాత్రమే ఇస్తున్నారు. అయితే కొందరు స్త్రీలకు ఇది సంతోషం కలిగించింది. జీతం మొత్తాన్ని తాగితందనాలాడి తగలేసే భర్తల చేతుల్లో డబ్బులు రాలకపోవడం మంచిదేననీ, ఎప్పుడో ఒకప్పుడు పెద్ద మొత్తం లభిస్తుందనీ వాళ్ళు కాస్త ఊరట చెందారు.

కొన్ని రోజులు ప్రశాంతంగా గడిచాయి. క్రమంగా పని ఒత్తిడి ఎక్కువైంది. అధికారులు చండశాసనుల్లా ప్రవర్తించసాగారు. కార్మికులు గానుగెద్దుల్లా నోరు తెరవకుండా మౌనంగా పని చేయాలని యాజమాన్యం ఆశిస్తోంది. జూలు విదిల్చే సింహాలను యజమానులు కోరుకొంటారా?

కార్మికులు తమ జీవితాలను విసుగ్గా వెళ్ళదీస్తున్నారు. జీవితంలో స్పందన కోల్పోయినట్టు కనిపిస్తున్నారు. ప్రపంచమంతా విసుగు అనే భావనతోనే నిండిపోయినట్టు భావిస్తున్నారు. ఆ విసుగూ, అసంతృప్తి వాళ్ళలో తమకు ప్రతికూలంగా పనిచేస్తోన్న ప్రతిశక్తినీ ధ్వంసం చేసేయాలన్న ఆలోచనకు ప్రోదిచేశాయి.

దయాదాక్షిణ్యాలు ఏ మాత్రం లేని అధికారుల ప్రవర్తనా, పరుషవాక్యాలూ వాళ్ళను బాధించాయి. ఆగ్రహం తెప్పించాయి. ఆవేశం రగిలించింది.

ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఒక రోజు గనిని సందర్శించాడు. అతడికి అతిథి గృహంలో అన్ని సౌకర్యాలు సమకూర్చారు. అతడు ముందు రోజు రాత్రే విచ్చేశాడని, స్త్రీ లోలుడని వార్తలు వచ్చాయి. అలాంటివాడు కార్మికులకు న్యాయం చేకూర్చుతాడా?

కార్మికులంతా పరిపాలనా భవనం ముందు గుమిగూడారు. తమ విజ్ఞప్తికి సానుకూల స్పందన లభిస్తుందని ఉత్సాహంగా చెప్పుకోసాగారు. ఇలాంటి ఆలోచన ముందే రానందుకు చింతించారు. తమ సమస్యకు పరిష్కారం లభిస్తుందని సంబరపడ్డారు.

వేదిక మీద కుర్చీలో అధికారి కూచున్నాడు (ఉబ్బిన చెంపలు, అలసిన కళ్ళు, బాన కడుపుతో). పందిలా కనిపిస్తోన్న అతడ్ని పదవి మాత్రం లేకుంటే ఎవరూ గౌరవించరు.

దేన్నో జాగ్రత్తగా వింటున్నట్టు, దేనికోసమో వెయ్యి కళ్ళతో ఎదురు చూస్తున్నట్టు నిశ్చలంగా ఉన్నారు కార్మికులు. కాకులూ, గువ్వలూ వాళ్ళ నిశ్శబ్దం

ధ్వంసం చేస్తూ గోల చేస్తున్నాయి. అధికారి అన్నాడు "మీరందరూ ఏడాది పాటు ఏ సమస్యనూ లేవనెత్తమనీ, రేషన్ చాలుననీ సంతకాలు చేశారు కదా, మరి మీ విజ్ఞప్తికి విలువ ఏముంటుంది?"

గుంపులోంచి ఒక్కడు సన్నని గొంతుతో అన్నాడు. "కుక్కకు ఎముక ముక్క వేశారు కాబోలు"

పక్కనే ఉన్న మరొకడు 'అలా అనకు. ఇది మేలిరకం కుక్క. మాంసం మాత్రమే ముట్టుకుంటుంది'

వయస్సు మళ్ళిన వాళ్ళు ఈ మాటలు విని భయపడ్డారు.

'పిల్ల కాకికేం తెలుసు ఉండేలు దెబ్బ! ఈ మాటలు వాళ్ళ చెవిన పడితే పుట్టగతులుంటాయా?'

కొద్దిసేపు నిశ్శబ్దం రాజ్యమేలింది. తర్వాత బికాస్ చౌదరి బిగ్గరగా అరిచాడు "మనం మోసపోయాం. దీనికి అంగీకరించలేం"

కార్మికులంతా ఉలిక్కి పడ్డారు. యాజమాన్యాన్నీ, ప్రభుత్వాధికారిని ధిక్కరించడమా! యాజమాన్యం తనమాట నిలబెట్టుకోకపోయినా, దాన్ని నిలదీయడానికి తమకున్న బలమెంత? నోరు విప్పితేనే జీతంలో కోత విధించడం, గూండాలతో బెదిరించడం వంటివి జరుగుతుండగా ఒప్పందాన్ని అంగీకరించబోమని చెప్పడం ఎంత ప్రమాదకరం! యాజమాన్యం బిమ్మిని తిమ్మి చేయగలదు, తిమ్మిని బమ్మి చేయగలదు. మనం అంగుష్ఠమాత్రులం, పర్వతాన్ని ఢీకొనగలమా? వాళ్ళ మనసుల్లో ఏవేవో సందేహాలు, సడలిపోతోన్న ఆత్మస్థైర్యం, తమ శక్తేమిటో తామే గ్రహించలేని అజ్ఞానం.

కానీ యువకులందరూ బికాస్‌ను అనుసరిస్తూ "అవును! ఆ ఒప్పందాన్ని చించిపారేస్తాం" అని అరిచారు. నుదుటిపై వాలుతోన్న వెంట్రుకల్ని వెనక్కు నెడుతూ, బికాస్ లేచి దగ్గర్లో ఉన్న మీట మీద నిలబడ్డాడు. విశాలమైన నుదురు, పెద్దపెద్ద చెంపలు, వెలుగు నిండిన కళ్ళు, తీక్షణమైన చూపులు – వెరసి బికాస్ రూపం, ఏదో విషయం మనసులో దాచుకొని దాని గురించి తీవ్రంగా ఆలోచిస్తున్నవాడిలా ఉన్నాడు.

"మనం పిరికిపందలం. నుదుటి రాతను నమ్ముకొని బతుకుతున్నవాళ్ళం. పాతాళం లాంటి గనిలోంచి బొగ్గును వెలికి తీసే శక్తి మనది. అయినా వేటగాడి చేతిలో విలవిల్లాడే కుందేలు పిల్లలా వీళ్ళ చేతుల్లో చిక్కుకుపోతున్నాం"

అట్టడుగు బావిలోంచి తొలి కేక వినిపించింది. మాట్లాడలేనితనం కాస్తా పోయి, పూరించిన శంఖారావం. అతడు దివి నుంచి భువికి దిగి వచ్చిన ఆర్తత్రాణ పరాయణుడిలా కనిపిస్తున్నాడు. 'ఇన్నాళ్ళు ఇతడు ఎక్కడ ఉన్నాడు? గొంతెత్తి మాట్లాడనీ. మనకు తెలియని విషయాన్ని తెలియ చెబుతున్నాడు. ఇతడు నిస్సందేహంగా దైవాంశ సంభూతుడే. ఇతడు మనకు జ్ఞానోదయం కలిగిస్తున్నాడు. మాట్లాడనీ, మన తరపున మాట్లాడనీ'

అతడు చెప్పసాగాడు "మనం రెక్కలు ముక్కలు చేసుకొంటున్నాం. దేనికోసం? కాసిన్ని సారాయి చుక్కలకోసం... ఆకలితోనో, అనారోగ్యంతోనో కన్నుమూసేదాకా విరామమంటూ లేకుండా నిరంతరం శ్రమిస్తున్నాం."

ఇది వరకు ఎవరి నాయకత్వం కిందా ఏకీకృతం కాని కార్మికులంతా ఏదో దుష్టశక్తి తన కబంధహస్తాల్లో తమను పట్టుకొని పీడిస్తోందని భావించి తమంత తాముగా ఒక్క తాటి మీదకు వచ్చారు. చేతుల్లో ఉన్న కందువాలను తలకు చుట్టుకొని, "మాట్లాడు, మాట్లాడు, ఇంతకాలం ఏ గుహలో దీర్ఘనిద్రలో ఉండిపోయావు" అని ఉత్సాహంగా అరవసాగారు.

బొగ్గుబావిలో అతడు చూడ్డానికి చింతనిప్పులాంటి కళ్ళతో, కొరివి దెయ్యంలా ఉన్నాడు. శతాబ్దాలుగా మట్టి కింద పేరుకుపోయిన బొగ్గులా, దశాబ్దాలుగా అణచివేతకు గురైన జీవితం కాస్తా తన సమస్యలను, అవసరాలనూ అతడి ద్వారా వెల్లడిస్తున్నట్లుంది.

'యజమాని ఇంట్లో శుభాశుభకార్యాలు, విదేశీ ప్రయాణం, సరికొత్త కారు కొనడం ఇలా ఏ సందర్భానికైనా సరే మనమే ఆ భారాన్ని మోయాల్సివస్తోంది. వాళ్ళ ఆడంబరాలు పెరిగే కొద్దీ మన ఆకలి ఎక్కువవుతోంది. మనకున్న స్వేచ్ఛంతా మన ఆడవాళ్ళతో కాపురం చేయడం వరకే పరిమితం. అప్పుడు కూడా మరో బిడ్డ పుడుతుందేమోనన్న బెంగ అట్టిపెట్టుకొని ఉంటుంది. ఇప్పుడు మన కర్తవ్యం ఏమిటి? మన హక్కుల్ని సాధించుకోవడమా? గొర్రెల్లా బానిసత్వాన్ని స్వీకరించి, ఈ గనిలోనే సమాధి కావడమా?

గతంలో అక్కడ ఎన్నో ప్రమాదాలు జరిగాయి. అయితే ప్రస్తుత ఘటన వాళ్ళను ఆలోచించడానికి పురిగొల్పింది. మానవత్వం లవలేశమైనా లేకుండా సాగుతోన్న అణచివేతను ఇక సహించబోమన్న తెగువ చూపడానికి ప్రేరేపించింది. తమ మనోభావాలు వెల్లడించడం ద్వారా తాము కూడా మనుషులమేనన్న ప్రాథమిక అస్తిత్వాన్ని చాటి చెప్పాలని తహతహలాడారు. ఏళ్ళ తరబడి గొంతుకలో బిగబడ్డ హక్కుల గీతం క్రమంగా వెలువడుతోంది. భయం, నిష్క్రియా పరత్వం, అంతా నుదిటిరాత అని సరిపెట్టుకొనే రాజీతత్వం అన్నీ రాత్రిపూట పువ్వు విచ్చుకొంటున్న శబ్దంలా క్రమంగా మరుగున పడి నవచేతనకు దారి చూపించాయి.

గాలికి ఒకదాని వెంట మరొకటి కదిలే వరిపైరులా కార్మికులు ఒకరిని అనుసరించి మరొకరు గొంతు విప్పసాగారు. 'యాజమాన్యాల విలాసం కోసం మా నెత్తురు ధారపోయలేం' అంటూ నినదించారు.

బికాస్ ఉత్సాహంతో అన్నాడు. 'యాజమాన్యం వారి అడుగులకు మడుగులొత్తుతున్న అధికారిని మనకు న్యాయం చేకూర్చమనీ, దగా చేస్తోన్న యజమాన్యాన్ని కట్టడి చేయమనీ' అడుగుదాం.

కార్మిక సమూహం ఆవేశంతో ఊగిపోయింది. 'అధికారి మనకు న్యాయం చేయాలి. తప్పుడు ఒప్పందాన్ని రద్దు చేయాలి' అంది ముక్తకంఠంతో

నిర్వాహకులూ, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి జడుసుకున్నారు. అడివంటుకొన్నట్లు కార్మికుల్లో ఆవేశం రగులుకొంది. గాలి ఎటు వీస్తే అటు అది వ్యాపిస్తుంది. నాయకత్వమూ, నియంత్రణ లేని ఆవేశం. సానుభూతిని రెచ్చగొట్టి, తన పబ్బం గడుపుకోవాలనుకొనే స్వార్థం దీనికి చోదకశక్తి. ఎవడో తిక్కమనిషి కార్మికుల్లో ఆవేశం రగిలించాడు. అతడు ఆ కార్మికుల్లోనే ఒకడై ఉంటాడు. వాళ్ళు వెల్లడించలేని వేడివేడి మాటల్ని అతడు గుప్పిస్తున్నాడు అతడ్ని కార్మికులందరూ దేవదూతగా భావించి, అతడి మాటలకు మంత్రముగ్ధులై ఆలకిస్తున్నారు. తాళం తప్పిన రాగంలా వాళ్ళ స్వరం 'అప్పుడప్పుడు' ఏం చేయ్యాలి? చెప్పు, చెప్పు అని అతడ్ని అడుగుతోంది.

"నిర్వాహకుడు, అధికారి మన ప్రశ్నలకు జవాబు చెప్పకుండా వెళ్ళడానికి వీల్లేదు. వాళ్ళ చుట్టూ కంచెలా మనం కూచుందాం" అందరూ అలాగే కూచున్నారు.

బికాస్ బిగ్గరగా అరిచాడు. "మాకు సరైన జీతం చెల్లించాలి. వైద్య ఖర్చుల్ని యాజమాన్యం భరించాలి. ఇళ్ళు కట్టించి ఇవ్వాలి. పండుగలకు సెలవులివ్వాలి. మా పిల్లల కోసం బడి పెట్టించాలి. మా ఆడవాళ్ళకు భద్రత కల్పించాలి. బొగ్గును సరిగా తూకం వెయ్యాలి. మాకు కార్మిక సంఘం నెలకొల్పుకొనే హక్కు కల్పించాలి...."

పాట పాడుతున్నట్టు కార్మికులు నినాదాలు చేస్తూనే ఉన్నారు. ఒకదాని తరువాత మరొకటిగా బాణాసంచా పేల్చుతున్నట్టు.

యాజమాన్యం ఉలిక్కిపడింది. వాళ్ళ మనసుల్లో కలవరపాటు. మబ్బులు లేకుండా హఠాత్తుగా మెరుపులు, ఉరుములతో వర్షం కురుస్తున్నట్లు అకస్మాత్తుగా తిరుగుబాటు జరగడం వాళ్ళను స్తంభింపజేసింది.

**(ఇంకావుంది)**

## పకోడీ పులుసు

**కావలసిన పదార్థాలు**

పకోడీలు - ఒక కప్పు, చింతపండు - అర కప్పు

ఉల్లిపాయ ముక్కలు - అర కప్పు, కారం - ఒక స్పూన్

ఉప్పు - తగినంత, పసుపు - పావు స్పూన్

నూనె - తగినంత, కొత్తిమీర - పావు కప్పు

కరివేపాకు ఆకులు - పావు కప్పు

అల్లం వెల్లుల్లి ముద్ద - అర స్పూన్

పంచదార - రెండు స్పూన్లు

**తయారు చేసేవిధానం**

శనగపిండిలో ఉల్లిపాయ ముక్కలు, ఉప్పు, కారం కలపాలి. పిండిని పకోడీల్లా చిదుపుకొని నూనెలో వేయించుకొని మామూలు పకోడీలను తయారు చేసుకోవాలి. వీటిని పక్కన పెట్టుకోవాలి. పాన్‌లో నూనె వేసి వేగాక ఉల్లిపాయ ముక్కలు వేసి, అల్లం వెల్లుల్లి ముద్ద వేయాలి. వేగాక కారం, పసుపు, ఉప్పు వేసి కరివేపాకు కలిపి కాస్త వేగనివ్వాలి. తర్వాత అందులో చింతపండు రసం తీసి పోయాలి. మరగనిచ్చి, పకోడీలను అందులో వేసి కొత్తిమీర చల్లి దించుకోవాలి. ఇది అన్నంలోకి రుచిగా వుంటుంది.

**పి. జ్యోతి**



## పాలవుండలు

**కావలసిన పదార్థాలు**

పాలు - నాలుగు కప్పులు,

పంచదార - రెండు కప్పులు,

మైదా - రెండు కప్పులు,

యాలకులు - అర స్పూన్,

వనస్పతి లేదా నూనె - వేయించడానికి

**తయారు చేసే వాధానం**

పాలను బాగా మరిగించాలి. ఎంత బాగా అంటే అవి ముద్దగా అవ్వాలి. తరువాత తీసి చల్లారనివ్వాలి. దీనిలో మైదా వేసి బాగా కలపాలి. చిన్న ముద్దలు చేసుకోవాలి. వీటిని వనస్పతి లేదా నూనెలో వేసి బంగారు రంగు వచ్చే వరకు వేయించాలి. పంచదారను పాకం పట్టుకుని అందులో వీటిని వేయాలి. యాలకుల పొడి చల్లాలి. చాలా రుచిగా వుంటాయి.






## చూర్ణ లడ్డూలు

**కావలసిన పదార్థాలు**

శనగపిండి - నాలుగు కప్పులు

పంచదార - రెండు కప్పులు,

నూనె లేదా వనస్పతి- వేయించడానికి,

జీడిపప్పు - అరకప్పు,

యాలకులపొడి - అరస్పూన్

**తయారు చేసే విధానం**

శనగపిండిలో నీళ్లుపోసి, బజ్జీల పిండిలా కలుపుకోవాలి. దాన్ని బూందీగరిటతో నూనె లేదా వనస్పతిలో బూందీలా వేసి వేయించి తీయాలి. చల్లారిన తరువాత పొడి చేసుకోవాలి. మిక్సీలో వేసి పంచదారను పొడి చేసుకోవాలి. వేయించిన జీడిపప్పు, కిస్‌మిస్‌లు, యాలకుల పొడి వేసి పాలతోగానీ, నీటితోగానీ తడి చేసుకుంటూ చక్కగా లడ్డూలు చుట్టుకోవాలి. రుచిగా వుంటాయి.



## ఆలుపువ్వులు

**కావలసిన పదార్థాలు**

బంగాళదుంపలు (ఆలుగడ్డలు)- ఆరు(అన్నీ సమాన సైజువి)

శనగపిండి - ఒక కప్పు, ఉప్పు - తగినంత,

బియ్యపుపిండి - అర కప్పు,

కారం - ఒక స్పూన్, నూనె - వేయించడానికి,

ఉల్లి తరుగు - అర కప్పు, కొత్తిమీర తరుగు - అర కప్పు

**తయారు చేసే విధానం**

ముందుగా బంగాళ దుంపలను కడిగి తుడిచి, పైపొట్టు తీసి పక్కన పెట్టుకోవాలి. ఒక్కోటి తీసుకుని నిలువుగా కట్‌చేస్తూ ముక్క విరగకుండా చుట్టూ పువ్వుల్లా చేయాలి. వీటిని నీటిలో కొద్దిగా ఉప్పు వేసి ఉడకనివ్వాలి. ముద్దగా ఉడకకూడదు. శనగపిండి, బియ్యపు పిండి ఓ దగ్గర చేర్చి కారం, ఉప్పు వేసి బజ్జీల పిండిలా కలపాలి. ఉడకబెట్టుకున్న బంగాళదుంప పువ్వులను కలిపి పెట్టుకున్న పిండిలో ముంచి నూనెలో వేయించాలి. వేయించిన తర్వాత ఈ పువ్వుల మధ్యలో ఉల్లితురుము, కొత్తిమీర తురుము పెట్టి ప్లేట్‌లో పువ్వుల్లా అలంకరించాలి. వీటిని సాస్‌తో వేడి వేడిగా తింటే చాలా రుచిగా వుంటాయి.

సమ్‌థింగ్ స్పెషల్

# 'పాజిటివ్' పెళ్లిళ్లు



ఇద్రిస్,అహ్మద్

**పెళ్లి కూతురు 'హువా ఇద్రిస్' బంగారువన్నె బట్టల్లో మెరిసిపోతోంది. గోరింటాకు పెట్టుకున్న ఆమె చేతులు రెప్పవాల్చకుండా చూడాలనిపించేంత అందంగా వున్నాయి. పెళ్లికొడుకు 'ఉమర్ అహ్మద్' కూడా కొత్త బట్టల్లో కళకళలాడిపోతున్నాడు. ఇద్దర్నీ మొహాల్లోను వెలుగు రేఖలు విరజిమ్ముతున్నాయి. మనసంతా సంతోషంతో నిండడం వల్లేమో ఇద్దరూ మరింత అందంగా కనిపిస్తున్నారు. వారి చుట్టూ వున్న బంధుమిత్రులు కూడా చాలా ఆనందంగా వున్నారు. ఆమెకు 32, అతనికి 39 ఏళ్లు.**

**ఇదంతా చదివే వారికి కూడా చాలా సంతోషంగా వుంటుంది. అయితే వారిద్దరి శరీరాల్లోనూ ప్రాణాంతక ఎయిడ్స్ క్రిములు తిష్టవేసుకుని కూర్చున్నాయని తెలిస్తే ఎలా వుంటుంది? ఒక్కసారిగా మనసంతా అదోలా అయిపోతుంది. కానీ అది నిజం. తమ జీవితాల్లోకి ఆహ్వానించబోతున్న వ్యక్తికి ఆ జబ్బు వుందని వారిద్దరికీ తెలుసు. 'మరి తెల్సి తెల్సి ఎలా జరుగుతోందీ వివాహం?' అన్న అనుమానం రావడం సహజం.**

'నా ఆరోగ్యం సంగతి తెల్సిందే కదా. నాకు పెళ్లవుతుందని నేనెప్పుడూ ఊహించలేదు. కానీ నాకు చాలా సంతోషంగా వుంది. ఇప్పుడు మాకొక పరిష్కారం లభించింది' అంటోంది ఇద్రిస్ సిగ్గుపడుతూ .

ఇద్రిస్, అహ్మద్ పరిచయం తమాషాగా జరిగింది. ఆ రోజు వాళ్లిద్దరూ హెచ్ఐవి మందుల కోసం క్లినిక్ దగ్గర నిలబడ్డారు. మహిళల వరుసలో ఆమె. పురుషుల వరుసలో అతను. ఆ ప్రదేశమంతా రద్దీగా... గొడవగొడవగా వుంది. అలాంటి వాతావరణంలో ఆ ఇద్దరి కళ్లు కలుసుకున్నాయి. ఊసులు చెప్పుకున్నాయి. అంతటితో ఆగలేదు సుమా. ఇద్దరూ ఫోన్ నెంబర్లు ఇచ్చిపుచ్చుకున్నారు. ఇంక చెప్పేదేముంది! పరిచయం దినదిన ప్రవర్ధమానమైంది. రెండు నెలల తర్వాత ఇద్రిస్ తల్లిదండ్రులతో మాట్లాడాడు అహ్మద్. ఆమెను పెళ్లి చేసుకుంటానన్నాడు. వివాహ సమయంలో పట్టుకున్న ఆమె చేతిని తన ప్రాణాలు పోయేవరకు విడిచి పెట్టనన్నాడు. వారు పచ్చ జండా ఊపేశారు. 68 డాలర్లు (పదివేలరూపాయలు) కట్నంగా ఇస్తానన్నారు. వీరిద్దరూ ఓ ఇంటివారవడానికి, అందుకు కావాల్సిన ఏర్పాట్లు చేసుకోవడానికిగాను 225 డాలర్లు అందచేసింది బుచి రాష్ట్రానికి చెందిన ఓ సంస్థ. వీరే కాదు! వీరిలా హెచ్ఐవి వున్న ఏ అమ్మాయి అబ్బాయి పెళ్లి చేసుకున్నా, చేసుకోవాలనుకున్నా ఈ సంస్థ ఇదే రీతిన ఆర్థిక సాయం అందిస్తోంది. ఇదేం చిన్న మొత్తం కాదు. ఎందుకంటే నైజీరియాలో సగానికి సగం మంది రోజుకి ఒక్క డాలరుతోనే బతుకుతుంటారు.

నైజీరియాలోని బుచి రాష్ట్రంలో మహ్మదీయులే అధికంగా నివసిస్తుంటారు. అక్కడ హెచ్ఐవితో బాధపడేవారి సంఖ్యా అధికంగానే వుంది. వారికి కౌన్సిలింగ్ ఇవ్వడమే కాక వారికి ఆర్థికంగా సాయం చేయడంలో, వారు వివాహం చేసుకునేలా ప్రోత్సహించడంలో బుచి రాష్ట్ర ప్రభుత్వం కీలక పాత్ర పోషిస్తోంది. అందుకుగాను బుచి యాక్షన్ కమిటీని నడుపుతోంది. ఈ సంస్థ హెచ్ఐవి పాజిటివ్ వున్న వారు పెళ్లి చేసుకునేందుకు మార్గం సుగమం చేస్తుంది. అలా ఒక ఇంటి వారైన వారిలో ఇద్రిస్, ఉమర్‌ది 94వ జంట. నైజీరియాలో 140 మిలియన్ల జనాభా వుంటే వారిలో 4 మిలియన్ల జనాభాకు హెచ్ఐవి వుంది. ప్రపంచంలోకెల్లా అత్యంత ఎక్కువగా ఎయిడ్స్ రోగులున్న దేశాలలో రెండవది నైజీరియా. ఈ దేశంలో మొత్తం 36 రాష్ట్రాలున్నా... హెచ్ఐవి వ్యాప్తి చెందకుండా వుండేందుకు చర్యలు తీసుకుంటోంది మాత్రం బుచి రాష్ట్రం ఒక్కటే.

ఉస్మాన్ జికో, హన్నా ప్రేమ వివాహానికి బీజాలు కూడా అదే క్లినిక్‌లో పడ్డాయి. పద్దెనిమిది నెలల సాన్నిహిత్యం తర్వాత వారి వివాహం జరిగింది. దీని వెనుక కూడా బుచి సంస్థ వుందని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదుకదా. తమ పెళ్లిరోజు గురించి అతనికింకా చాలా స్పష్టంగా గుర్తుంది. "ఆరోజు చాలా మంది శ్రేయోభిలాషులు, బంధువులు మా పెళ్లికి వచ్చారు. ఎంతో సంతోషంగా నృత్యం చేశారు. ఆ తీపి జ్ఞాపకాన్ని ఫొటోల రూపంలో భద్రపరచుకున్నాం. అసలు నేను హెచ్ఐవి పాజిటివ్ అని తెల్సుకున్నప్పుడు ఈ ప్రపంచం ఇంతటితో అయిపోయిందనుకున్నా. చాలా బాధపడ్డా. నా స్నేహితుల నుంచి దూరమైపోయినట్టు, ఒంటరినైనట్టు అనిపించింది. కానీ ఇప్పుడు నాకూ ఓ తోడుంది. నా గురించి అన్నీ అర్థం చేసుకునే జీవిత భాగస్వామి వుంది. మేం మా సమస్యలను పంచుకుంటాం. ఇద్దరం ఒకరు వేసుకోవాల్సిన మందుల గురించి మరొకరం గుర్తు చేసుకుంటాం' అంటాడు జికో.

నలభయ్యేళ్ల 'బాలా గార్బా' సైనికుడు. ఇరవైనాలుగేళ్ల టీచర్ 'రబిఇబ్రహీం'ను వివాహమాడాడు. వీరిద్దరు కూడా క్లినిక్ దగ్గరే కలుసుకున్నారు. 'మా పెళ్లి వల్ల మా జీవితాలకు స్వాంతన లభించింది. పైగా హెచ్ఐవి పాజిటివ్ అన్న విషయాన్ని బహిర్గతం చేయాల్సిన అవసరం వుండదు" అంటాడు గార్బా. ఈ మధ్యే వీరికి ఓ బాబు పుట్టాడు. పేరు 'మూసా'. అయితే రబికి వున్న హెచ్ఐవి ఈ చిన్నారికి రాకుండా బుచి యాక్షన్ కమిటీ అన్ని రకాల చర్యలు తీసుకుంది. ఈ సంస్థ ఇస్తున్న సలహాలు, సూచనలు పాటిస్తూ మందులు వేసుకుంటూ వారు సుఖంగా సంసార జీవనం సాగిస్తున్నారు.

హెచ్ఐవి పాజిటివ్ వున్న వారి వల్ల ఇతరులకు ఎయిడ్స్ సోకకుండా బుచి సంస్థ ప్రయత్నిస్తోంది. పాజిటివ్ వున్న వారు ఒకరినొకరు వివాహం చేసుకునేలా ప్రోత్సహిస్తోంది. ఈ కార్యక్రమాన్ని బుచి సంస్థ రెండేళ్ల క్రితం ప్రారంభించింది. హెచ్ఐవి పాజిటివ్ వున్న వారిని గుర్తించడం, ఒకరినొకరు ఇష్టపడ్డవారు చట్టపరంగా భార్యాభర్తలయ్యేందుకు కావాల్సిన సాయం అందించడం ఆ సంస్థ ప్రధాన కార్యక్రమం. పైగా గర్భందాల్చిన వారి బిడ్డలకు హెచ్ఐవి సంక్రమించకుండా కావాల్సిన వైద్య సహాయాన్ని అందిస్తుందా సంస్థ. ★

కథ

# దంతపు దువ్వెన

**- అత్తివిల్లి బాలసుబ్రహ్మణ్యం**

ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలవుతోంది. నేను నాగదిలో కూర్చొని కాంపోజిషన్ పుస్తకాలు దిద్దుకొంటున్నాను. 'బతకలేక బడిపంతులన్న' సామెత నా పట్ల అక్షరాలా నిజమయింది. డిగ్రీ పూర్తయ్యాక మరి చదువుమీద శ్రద్ధ తగ్గడంతో -కథలు, వ్యాసాలూ రాస్తూ కాలం గడిపేవాణ్ణి. 'చదువు లేకపోతే పోనీయ్, ఏదేనా ఉద్యోగమైనా ప్రయత్నించి చూడరా' అని ఇంట్లో పోరగా, పోరగా, చివరికి టీచర్‌గిరీకి అప్లికేషన్ పెట్టాను. అదృష్టవశాత్తూ అది కాస్తా వచ్చింది. వెంటనే జాయిన్ అయ్యాను. అయిందా, 'పెళ్ళి చేసుకోరా! నీ పెళ్ళి కళ్ళారా చూసి కళ్ళు మూస్తాం' అని తాతయ్య మామ్మా వేధించ సాగేరు. తప్పుతుందా! సరేనన్నాను. ఫలితం! సరళ నా జీవితంలోకి అడుగు పెట్టింది.

వీధి గుమ్మంలో ఏదో కారాగిన చప్పుడైంది. నా ఆలోచనా ప్రవాహానికి ఆనకట్ట వేశాను. ఎవరి ఇంటికో ననుకుంటూ సగం దిద్ది విడిచిన పుస్తకం మీద కలం ఉంచాను. కాని ఈ మారు ఎవరో తలుపు తట్టడం వినిపించింది. ఇక తప్పదురా, మహాప్రభో, అనుకుంటూ తలుపు దగ్గరికి నడిచి, గడియ తీశాను. నా కళ్లెదుట ఇండస్ట్రియలిస్ట్ రమాదేవి సాక్షాత్కరించింది తన ఇద్దరు పిల్లలతో!

ఇక్కడ రమాదేవి గురించి కొంచెం చెప్పుకోవాలి. రమాదేవి భర్తహీన. ఆమెకి సముద్రతీరానికి సమీపంలో అందమైన తోటతో గూడిన ఒక బంగ్లా వుంది. ఆమెకి లెక్కలేనంత మంది స్నేహితులున్నారు. వారంతా ప్రతి ఆదివారమూ ఆ బంగళాలో సమావేశమౌతుంటారు. సముద్రం పైనుండి చల్లని గాలులూ వీస్తుండగా ఆహ్లాదంగా వున్న ఆ తోట బంగళాలో వీళ్ళు సాయంకాలం ఐదుగంటలకి మీటై, అనేకానేక కబుర్లు చెప్పుకొంటుంటారు.

రమాదేవి సహజంగా దయార్ద్ర హృదయురాలు. అమెని అందరూ గౌరవిస్తారు. ఆ ఊళ్లో ఇంచుమించు అందరికీ ఆమె పరిచయస్తురాలే! భర్త రెండు సంవత్సరాల కిందట పోవడంతో, భర్త వదిలి వెళ్ళిన వ్యాపార కార్యకలాపాలను నిర్విఘ్నంగా నిర్వర్తిస్తోంది.

'ఒలికిపోయిన పాల కోసం ఏడవడం నా తత్వం కాదు' అని అంటూందామె. ఆమె రోజంతా తన వ్యాపార లావాదేవీలతో పాటు, లెక్కలేనన్ని సాంస్కృతిక కార్యకలాపాల్లో కూడా పాలుపంచుకుంటూ -ఎప్పుడు చూసినా 'బిజీ' గానే ఉంటుంది. ధనవంతురాలు. విద్యావతి, గుణవతి, కోట్లకధికారిణైనా, బీదవారిని, గొప్పవారిని సమానంగా చూస్తుంది. సోమరితన జాఢ్యాన్ని ఎంతమాత్రం సహించదు. ఎవరికీ ఉత్తనే ఏమీ ఇవ్వదు. సంపాదించాలంటే ఎవరికి వారు నడుములొంచి శ్రమపడాల్సిందే నంటుంది. ఈ విధంగా ఆ ఊళ్ళో అందరికీ ఆమె తలలో నాలుకలా వుంటుంది.

అటువంటి గ్రేట్ రమాదేవి స్వయంగా నా ఇంటిని వెతుక్కుంటూ వచ్చిందంటే ఆశ్చర్యం కాదా?

“గుడ్‌ఈవినింగ్, మేడమ్! ప్లీజ్, దయచేసి లోపలికి రండి” అంటూ సాదరంగా ఆహ్వానించాను.

ఇంతలో నా భార్య సరళ, “ఎవరండీ?” అంటూ ప్రవేశించింది.

“రా, సరళా! ఈవిడ- నీకు తెలుసనుకుంటా! పరిచయం అక్కర్లేని పర్సనాలిటీ ఈవిడ -శ్రీమతి రమాదేవి!” అంటూ,

“ఈమె నా భార్య సరళ, మేడమ్! అంటూ పరిచయాలు పూర్తి చేశాను.

“ నమస్కారమండీ!”

“నమస్కారం, అమ్మా!” అంటూ రమాదేవి “మేష్టారు! వీళ్ళిద్దరూ నా పిల్లలు - లత, గోపి! వీరికి మీరు ట్యూషన్ చెబుతారేమోనని అడగడాని కొచ్చేను” అంది. “నమస్కారం మేష్టారు!” అన్నారిద్దరు పిల్లలూ, చిలక పలుకుల్లా ముద్దుగా.

“నమస్కారం చిల్డ్రన్, వెరీ గ్లాడ్!” అంటూ ఆమె పక్కకు తిరిగి, నాకేమీ అభ్యంతరం లేదు మేడమ్! కాని, అంత దూరం రోజూ నడిచి రావాలని ఆలోచిస్తున్నాను...” అన్నాను.

అంతవరకు గది నలుమూలలూ తీక్షణంగా చూస్తున్న రమాదేవి ఒక్కసారి వులిక్కిపడింది. “ఆఁ, ఏమిటన్నారు? మీరు రోజూ అంతదూరం నడిచి రావాలనా మీ సందేహం! అవసరం లేదు! మాపిల్లలే మీ దగ్గరికి రోజూ ఉదయం సాయంకాలం మా కారులో వచ్చి వెళ్తుంటారు లెండి అన్నదామె.

“అయితే ఓకే! రేపట్నుంచే పిల్లలను పంపించండి” అన్నాను.

“మరి నేను వస్తానయితే, మేష్టారు!” అంటూ సరళతో “నేనిక వెళ్లొస్తానమ్మా ” అంటూ లేచిందావిడ.

“మంచిది మేడమ్” అన్నాను, నేను కూడా లేస్తూ ఆమెను సాగనంపడానికి,

రమాదేవి వెనకనే పిల్లలిద్దరూ నడిచారు. ఆమె వెళ్తున్నదల్లా మరొక మారు గదంతా కలియజూసి బయటికి నడిచింది.

నేను మా ఆవిడా -ఆమె విచిత్ర ప్రవర్తనకు ఆశ్చర్యపోయాం!

◆ ◆ ◆

**నాక్కూడా ఆమె విచిత్ర ప్రవర్తనకు కారణం అర్థమయ్యేది కాదు. నామటుకు నేను, “ఆమె చూపుల్లో తీక్షణత లేదు. ఏదో పోగొట్టుకున్నట్టున్న దృక్కులవి! కొందరి చూపులే అంత” అని సరిపెట్టునేవాణ్ణి. ఆమె మనస్సు మాత్రం చాలా మంచిది. ఆమె మీద ఎంతగా తెచ్చుకోవాలన్నా నాకు మటుకు చెడభిప్రాయం కలగలేదు. నా ట్యూషన్ ఫీజు ఆవిడ పిల్లల ద్వారా ప్రతీనెలా క్రమం తప్పకుండా పంపేది. అంతకంటే నాకేం కావాలి?**

పిల్లలిద్దరూ రోజూ కారుమీద నా దగ్గరకు వచ్చి వెళ్తున్నారు. అప్పుడప్పుడు రమాదేవి కూడా వచ్చి మా ఆవిడతో మాట్లాడి వెళ్తోంది. క్రమంగా వారిద్దరూ స్నేహితులయ్యారు. సరళ ఏ టాపిక్ వచ్చినా ఆమె గురించే ఏదో చెప్తూండేది. కాని, ఆవిడ విచిత్ర ప్రవర్తనను మటుకు గర్హించింది. "ఆమె అన్ని గుణాలు నాకు నచ్చాయి. కాని, ఆ దొంగ చూపులే నాకే మాత్రం నచ్చడం లేదు. ఎప్పుడొచ్చినా, మనమేదో తన సొత్తేదో దాచిపెట్టుకున్నట్టు అన్ని వైపులా చూస్తుంది. ఉన్నట్టుండి సంభాషణ మధ్యలో ఆవిడ చూపులు సీరియస్‌గా దేనికోసమో వెతుకుతున్నట్టుంటాయి" అంటుంది సరళ.

నాక్కూడా ఆమె విచిత్ర ప్రవర్తనకు కారణం అర్థమయ్యేది కాదు. నామటుకు నేను, "ఆమె చూపుల్లో తీక్షణత లేదు. ఏదో పొగొట్టుకున్నట్టున్న దృక్కులవి! కొందరి చూపులే అంత" అని సరిపెట్టునేవాణ్ణి.

ఆమె మనస్సు మాత్రం చాలా మంచిది. ఆమె మీద ఎంతగా తెచ్చుకోవాలన్నా నాకు మటుకు చెడభిప్రాయం కలగలేదు. నా ట్యూషన్ ఫీజు ఆవిడ పిల్లల ద్వారా ప్రతీనెలా క్రమం తప్పకుండా పంపేది. అంతకంటే నాకేం కావాలి?

ఇలా వుండగా అకస్మాత్తుగా ఆమె గురించి దుష్ప్రచారం బయల్దేరింది. నేను వాకబు చేయగా ఈ ప్రచార కారకురాలు కాంతమ్మ అని తెలిసింది. కాంతమ్మ మహా చెడ్డ మనిషి. ఒకరు పచ్చగా వుంటే సహించే తత్వం కాదు ఆమెది!

కాంతమ్మ రమాదేవి గురించి అందరితోనూ చెడుగా మాట్లాడసాగింది. దానిని కొంతమంది నమ్మారుకూడా! ఇంకేముంది త్వరలోనే వూరంతా వ్యాపించింది ఆ ప్రచారం! ఇంతకీ ఆ దుష్ప్రచారమేమిటో తెలుసా? రమాదేవి చాలామంది ఇళ్ళల్లోంచి దువ్వెనలు దొంగిలిస్తున్నదని! ఎంత నమ్మలేనిదీ నిజం?

అంత ధనవంతురాలు సామాన్యులింట్లో పన్నెలు దొంగిలిస్తుందా? నేను మాత్రం ఈ వార్తని ఎంత మాత్రం విశ్వసించలేదు. నాముందెవరైనా అలా మాట్లాడితే వెంటనే గదిమి వాళ్ళ నోళ్ళను మూయించే వాణ్ణి.

కాని నేనే నమ్మలేని నిజాన్ని, దేన్నైతే చీదరించుకుంటూన్నానో దాన్నే నమ్మాల్సిన రోజొకటి వస్తుందని కలలో కూడా అనుకోలేదు.

ఒకరోజు సరళ నాతో, "మన దువ్వెన గాయబ్ అయిందండీ" అన్నది.

అప్పుడు నాకెందుకో అనిపించింది. ఇది కేవలం దుష్ప్రచారమని కొట్టి పారెయ్యడానికి లేదని! అదే రోజు రమాదేవి మా ఇంటికి వచ్చి వెళ్లడం, మా పన్నె కనబడకపోవడానికీ ఏదో సంబంధ ముందనిపించింది. అయితే, ఇందుకెలాంటి ఋజువూలేదని నాకు తెలుసు! రమాదేవి గొప్పదనం, మంచితనం చిన్నది ఖరీదైన మా దువ్వెన నా ఎదుట రెండు పెద్ద ప్రశ్నలుగా నిలిచాయి! నేను నా మనస్సులో ఎన్నోసార్లు ఒక ధనవంతురాలు తన స్నేహితుల ఇళ్లలో జొరబడి, పన్నెలు దొంగిలించడం సంభవమేనా? అని ప్రశ్నించుకున్నాను. దానికి నేను సరయిన సమాధానాన్ని పొందలేకపోయాను.

రమాదేవి పిల్లలిద్దరూ మాత్రం యాధావిధిగా, సక్రమంగా నావద్ద చదువుకుంటున్నారు. రమాదేవి పన్నెల దొంగనే విషయం క్రమంగా ఊరంతా గుప్పుమంది. కాని, ఆమె మటుకు ఈ ప్రచారాలతో తన కెటువంటి సంబంధం లేదన్నట్టు నిశ్శబ్దంగా మిన్నకుండి పోయింది. ఇంకో విషయం కూడా, సరళ ద్వారా నాకు తెలిసింది! అది రమాదేవి స్నేహితులు ఆమె తమ ఇంటికి రాగానే తమ తమ పన్నెలను కనబడకుండా ఎక్కడో దాచేస్తున్నారట!

నాకు చాలా బాధనిపించింది. ఆమె ఎందుకిలా నలుగురి నోట్లో పడుతూ, వూరుకుంటుందో నాకయితే అర్థం కాలేదు. రమాదేవి పన్నెల దొంగతనం అలా చాలా రోజుల వరకు ఒక మిస్టరీగానే వుండిపోయింది. ఆమె లాంటి ప్రిన్సిపల్డ్ లేడీ అందరిచేత నిందలు పడ్తూ, నెట్టు కొస్తుండడం నాకాశ్చర్యమనిపించింది. అన్నీ ఎరిగుండి వాటిని అరికట్టడానికి ప్రయత్నిస్తే ఇంకా అధికమౌతాయని వూరుకుందేమోననిపించింది. నాకు ఈ సమస్యను పరిష్కరించడానికి మార్గం తోచక నా రొటీన్‌లో నేను మునిగి పోయాను.

ఇలా కొన్ని నెలలు గతించాయి.

ఒకనాడు రమాదేవి పిల్లలు నాకొక మూసివున్న కవరునందించారు. అది రమాదేవి రాసినది. అందులో ఇలా వుంది.

రావుగారికి,

రేపు నా జన్మదిన సందర్భంగా పార్టీ ఏర్పాటు చేసాను. మీరు మీ భార్యతో సహా తప్పకుండా మా ఇంటికి వస్తే-ఎంతో సంతోషిస్తాను.

ఇట్లు

కె. రమాదేవి.

ఆ ఉత్తరాన్ని చదివి, పిల్లల ఆనందాన్ని చూసేక తప్పక వెళ్లాలని నిశ్చయించుకున్నాను. సరళ కూడా సరేనంది.

మర్నాడు సరళతో రమాదేవి తోట బంగళా చేరేను. ఆమె మమ్మల్ని చూస్తూనే చిర్నవ్వుతో, "రండి, రండి" అంటూ ఆహ్వానం పలికింది.

సహజంగా అందగత్తె అయిన ఆమె తల స్నానం చేసి కొత్త బట్టలు వేసుకుందేమో-ఇంకా అందంగా కనబడుతోంది!

బంగళా లోపలికెళ్ళాము- ఆశ్చర్యం! అక్కడ మేము తప్పించి ఇంకెవ్వరూ లేరు! అంటే, ఎవరినీ పిలవలేదన్న మాట!

పార్టీ రమాదేవి గార్డెన్లో ఘనంగా, వైభవంగా, జరిగింది. ఒక్కసారిగా, నా జన్మలో రుచి చూడని తినుబండారాలెన్నో చవి చూశాను. తర్వాత మేము ఇంటికి బయల్దేరాం. వెళ్ళేముందు రమాదేవికి చిన్న పెట్టె బహూకరిస్తూ "ఏదో -ఇది నా శక్తి కొద్దీ ప్రజంట్ చేస్తున్నాను. మీరిలాగే మరెన్నో జన్మదినాలు నిరాటంకంగా జరుపుకోవాలని ఆ భగవంతుని ప్రార్థిస్తాను. నా ఈ చిన్న కానుకని స్వీకరిస్తారని ఆశిస్తాను" అన్నాను.

"థాంక్యూ, మిస్టర్ రావ్! ఇది నిజంగా మీ ఆత్మీయత, స్నేహానికి గుర్తుగా భావించి భద్రపరుస్తాను" అంది రమాదేవి - ఆ పెట్టెను విప్పడానికి ఆతృతతో సిద్ధమౌతూ.

అంతే! ఆమె ఆ బాక్స్‌లోని వస్తువు కేసి చలనంలేని విగ్రహంలా కన్నార్పకుండా చూస్తూండిపోయింది. ఏదో విషమ పరిస్థితి ఏర్పడుతుందని నేనామెను కూర్చోమన్నాను. కాని ఆమె వున్నట్టుండి బిగ్గరగా నవ్వింది. తర్వాత రమాదేవి హస్తాలు నా భుజమ్మీద బలంగా పడ్డాయ్!

"మిస్టర్ రావ్! ఇటువంటి కానుకనే నా భర్త దగ్గర నుండి కొన్ని సంవత్సరాల క్రితం అశించాను. నాకారోజుల్లో పొడవైన, నిగనిగలాడే తాచుపాములాంటి శిరోజాలు వుండేవి. నా భర్త నా పొడవైన కేశ సౌందర్యానికి ఆనందించి, నాకొక దంతపు పన్నెను ప్రజెంట్ చేయాలనుకున్నారు. అనుకోడమే కాకుండా కొన్నారు. కూడా! అయితే ఆయన వద్దనుండి ఆ పన్నె పొందే అదృష్టం నాకు లేకపోయింది. ఆయన అంతలోనే ఆ రోజే - ఒక కారు ప్రమాదంలో మరణించారు. అంత ప్రీతితో, అభిమానంతో ఆయనిద్దామనుకున్న ఆ దంతపు దువ్వెనను నేను మరెప్పటికీ పొందలేక పోయాను. అదేమయిందో నాకు తెలియలేదు. దానిని వెతికే ప్రయత్నంలోనే - చాలా మంది ఇళ్ళల్లో నేనొక పన్నెల దొంగననే ఆపవాదును మూట కట్టుకున్నాను. ఇన్నాళ్ళకి- నా మనోదుఃఖాన్ని తొలగించే మీ ఈ ప్రజెంట్‌ని నేనెలా తిరస్కరించగలను! మీకు మరోసారి నా థాంక్స్ రావుగారూ!"

ఆ రోజు రాత్రి పడుకోబోయే ముందు, ఒక మంచి వ్యక్తి యొక్క పెద్ద సమస్యను విజయవంతంగా పరిష్కరించినట్టు నేను భావించాను. ఇంతకీ నేను రమాదేవికిచ్చిన బహుమతి 'దంతపు దువ్వెన' అని ప్రత్యేకంగా చెప్పాలా?

**(ఎప్పుడో చదివిన ఒక ఆంగ్ల కథ ఆధారంగా)**

★

# దాల్ డాలీ

**చేద్దామా**

**హాయ్** నేస్తాలూ ఈ బొమ్మ నచ్చిందా? మరైతే మీరూ చేయొచ్చుగా. నేర్చుకుంటానంటే చెప్తా. పైగా ఇది తయారు చేయడం చాలా తేలిక. అందుకు కావాల్సిన వస్తువులను షాపుకెళ్లి కొనక్కర్లా. హాయిగా ఇంట్లో దొరికే వాటితోనే చేయొచ్చు. మరి మొదలెడదామా!

<u>ఏమేం కావాలంటే...</u>

పచ్చి శనగపప్పు, ఆవాలు, కరివేపాకు, ఆకు (ఏదైనా), పెన్సిల్ పొట్టు, గమ్, తెల్ల కాగితం.

<u>ఎలా చేయాలంటే...</u>

ముందుగా తెల్ల కాగితం తీసుకోండి. దాన్ని మనం ఎంత బొమ్మ వేయాలనుకుంటే అంత సైజుకి కత్తిరించుకోండి. చుట్టూ ఔట్ లైన్ గీసుకోండి. మొదట బొమ్మ గౌను నుంచి మొదలెడదాం. దీనికి పెన్సిల్ పొట్టు తీసుకోండి. చూశారుగా. బొమ్మలో చక్కగా నిజమైన ఫ్రాక్‌లాగే వుంది. అలాంటి పెన్సిల్ పొట్టు తీసుకొని ఒకవైపు గమ్ పూయండి. దాన్ని జాగ్రత్తగా పేపరు మధ్యలో అతికించండి. ఇప్పుడు బొమ్మ కాళ్ల దగ్గరకు వద్దాం. దీనికి పచ్చి శనగపప్పు కావాలి. తీసుకుని ఇక్కడి బొమ్మలో లాగా రెండు వరుసల్లో అతికించండి. తర్వాత బూటు లాగా కరివేపాకు ఆకులు అతకించేయండి. బొమ్మ సగం అయిపోయినట్టే. ఇప్పుడు బొమ్మ చొక్కా దగ్గరకు వద్దాం. దానికి ఆకు తీసుకొని కావాల్సిన సైజులో కత్తిరించుకోండి. కింది వైపు కత్తెరతో సన్నగా చీలికలు పెట్టండి. అదో డిజైన్‌గా బావుంటుంది. చేతుల్లాగా ఆవాలు అతికించండి. చివరలో పచ్చి శనగ పప్పు అతికించేయండి. తర్వాత మెడ. దానికి కూడా పచ్చి శనగ పప్పు ఒకటి అతకిస్తే సరి. ఇక తల. దీనికి కూడా ఆకును గుండ్రంగా కత్తిరించి అతికించండి. దీనిమీద కళ్లు, నోరుకు ఆవాలు అతికించండి. ఇంక నెత్తిమీద వెంట్రుకలకు కూడా ఆవాలనే ఉపయోగించాలి. ఇలా అతికించేశాక జాగ్రత్తగా ఆరనివ్వండి. అంతే డాల్ రెడీ. దీన్ని ఎంచక్కా ఏదైనా అట్టమీద అతికించేసి షోకేస్‌లో పెట్టొచ్చు. లేదా గోడకు వేళ్లాడదీయొచ్చు. మీ ఇంటికి వచ్చిన అతిథుల కళ్లన్నీ దానిమీదే నిలిచిపోతాయుంటే నమ్మండి. మరి చేసేస్తారా!



**- చూటీ**

## పొడుపు కథ విప్పుతారా

నేనెవరిని?

1. నన్ను అతగాడు అంగట్లో చూచాడు. చూడగానే కొన్నాడు. కొనగానే ఒలిచాడు. ఒలవగానే కొట్టాడు. కొట్టగానే నవ్వాను. ఇంతకీ నేనెవరిని?

ఎవరినబ్బా...

2. నన్ను అంగట్లో కొంటారు. ముందర పెట్టుకొని ఏడుస్తారు. ఇంతకీ నేనెవరినబ్బా...

ఏంటో అవి?

3. అదో పెద్ద వస్త్రం. ఎవరికీ అందదు. దాని మీద అన్నీ వడియాలే. ఇంతకీ ఏంటబ్బా అవి.




**చి**న్నారులూ... ఇక్కడ ఇద్దరు మిత్రులు పజిల్ పూరించలేక తెగ కష్టపడుతున్నారు. కాస్త మీరు సాయం చేయొచ్చుకదా. ఇంతకీ మీరేం చేయాలంటే పజిల్ కింద ఐదు బాక్సులున్నాయికదా. వాటిలోకి వచ్చే అక్షరాన్నీ కలిపితే ఒక పేరొస్తుంది. అదేంటి?

# మొదట ఎవరు?

**నే**స్తాలూ... వేసవి సెలవులు కదా. అరవింద్, వీరేంద్ర, కౌశిక్ బోటింగ్‌కి వెళ్లారు. ఎంచక్కా బోట్ నడుపుతున్నారు. అయితే అకస్మాత్తుగా తుపాకీ పేలింది. అదీ వీళ్లు వెళుతున్న దిశగా. దాంతో ముగ్గురూ భయపడ్డారు. కానీ విషయాన్ని పసిగట్టారు. అరవింద్ తుపాకీ పేలిన శబ్దం విన్నాడు. వీరేంద్ర తుపాకీ నుంచి వచ్చిన పొగ చూశాడు. బుల్లెట్ నీళ్లల్లో పడిన విషయాన్ని కౌశిక్ కనిపెట్టాడు. ఇంతకీ బులెట్ పేలినట్టు ముందుగా ఎవరు కనిపెట్టినట్టు?

| | | | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| C | G | B | E | A | P | Y | C | A | T | E | P | I | L |
| Y | O | Z | Y | E | F | A | S | U | K | I | C | C | O |
| U | G | W | O | L | F | Z | Y | E | B | I | D | A | O |
| V | J | K | B | A | T | V | U | C | M | Y | N | A | H |
| T | I | R | N | U | G | D | W | R | A | E | A | D | O |
| P | C | R | O | W | F | C | B | A | V | K | E | B | R |
| G | S | G | I | R | A | F | F | E | X | N | C | F | S |
| H | P | E | L | E | P | H | A | N | T | O | W | L | E |
| S | G | C | O | G | I | W | P | L | A | M | B | I | C |
| A | A | T | A | O | G | O | I | B | O | P | S | N | P |
| E | S | S | W | D | P | R | G | B | A | C | D | I | Y |
| L | O | A | O | K | A | R | E | I | C | A | A | O | E |
| G | I | N | X | V | R | A | O | G | D | C | W | G | K |
| A | K | W | Z | Y | R | P | N | T | S | O | N | N | R |
| E | O | L | A | I | O | S | T | R | I | C | H | E | U |
| Y | R | E | G | I | T | D | I | A | N | K | E | P | T |

## కనిపెట్టండి చూద్దాం

హాయ్ చిన్నారులూ... నాపేరు పి. నవ్యశ్రీ, హైదరాబాద్‌లోని సెయింట్ పాయిస్ హైస్కూల్లో 7వ తరగతి చదువుతున్నాను. వేసవి సెలవుల్లో ఈ పజిల్‌ని తయారుచేశాను. ఇందులో జంతువులు, పక్షులు చెరో 15 వున్నాయి. గుర్తించండి చూద్దాం.

## జత చేద్దాం

పిడుగులూ... కింద 8 మంది తలలున్నాయి. అయితే ఇందులో ఒకరి తలలో సగం మరొకరి దగ్గరుంది. ఏ రెండు భాగాలను కలిపితే ఒక తల వస్తుందో మీరే గమనించి జతచేయాలి. రెడీనా!









## తేడాలు గుర్తించాలోచ్

బుజ్జాయిలూ ఈ రెండు బొమ్మల్లోను ఆరు తేడాలున్నాయి. మీరు వాటిని కనిపెట్టి సున్నా చుట్టాలి. మరి ఆలస్యం ఎందుకో...

## గీయగలరా!

చిన్నారులూ...పక్కన కొన్ని బొమ్మలున్నాయి. మొదటి రెండు వరుసల్లో మూడేసి బొమ్మలున్నాయి. ఒక్కో వరుసలో వున్న మూడు బొమ్మలూ ఒకే రకమైన భావాన్ని వ్యక్తం చేస్తున్నాయి. అయితే మూడవ వరుసలో ఒక బొమ్మ మిస్సయ్యింది. దాన్ని మీరు చిటికెలో గీయాలి. మరి పెన్నో పెన్సిలో తీసుకొని మొదలెట్టండీ...





### జవాబులు

జత చేద్దాం:

ఎ-6, బి-5, సి-8, డి-7, ఇ-4, ఎఫ్-3, జి-2, హెచ్-1.

తేడాలు కనిపెట్టాలోచ్:

1.రాళ్లు కదిలాయి 2. చెట్టు మిస్సయింది 3. చెయ్యి కదిలింది 4. చెట్టు కొమ్మ మిస్సయింది. 5. నోరు తేడాగా వుంది 6. అబ్బాయి లాగు మీద చార

గీయగలరా! :



పొడుపు కథ విప్పతారా :

1.కొబ్బరికాయ,

2.ఉల్లిపాయ,

3.ఆకాశం, నక్షత్రాలు

మొదట ఎవరు?

తుపాకీ నుంచి వెలువడిన పొగను చూసిన వీరేంద్ర ఆ విషయాన్ని మొదట కనిపెట్టినట్టు. తుపాకీ పేలిన శబ్దాన్ని విన్న అరవింద్ ఆ విషయాన్ని తెలుసుకున్న రెండవ వాడు. బులెట్ నీళ్లల్లో పడడాన్ని కనిపెట్టిన కౌశిక్ ఆ విషయాన్ని తెలుసుకున్న మూడవ వాడు. ఎలాగంటే శబ్దం కంటే వెలుగు వేగంగా ప్రయాణిస్తుంది. అయితే శబ్దం బులెట్ కంటే వేగంగా ప్రయాణిస్తుంది.

పేరేంటబ్బా...

NODDY

అట్టమీది కథ

# రుతు పవనాలు... జీవన తరంగాలు...

**పియుఎస్ భాస్కరరావు**

**వేసవిలో చండ ప్రచండుడైన భానుడు విజృంభిస్తాడు. చమట, ఉక్కపోతతో జనాన్ని విసిగిస్తాడు. వేసవికాలం ఎప్పుడు పోతుందిరా బాబూ... చిరుజల్లులు ఎప్పుడు పడతాయిరా నాయనా అనుకునే జనావళికి.. ఉపశమనాన్ని కలిగించేవే జూన్‌లో వచ్చే రుతుపవనాలు. ఇవి మన జీవితంలో అంతర్భాగం. వాటితోనే మన గమనం. వాటితోనే మన సౌభాగ్యం. రుతు పవనాలు మన జీవన తరంగాలు. మన దేశంలో అత్యధిక వర్షపాతం రుతుపవనాల ద్వారానే లభిస్తోంది. దేశంలో నైరుతి రుతుపవనాల వల్ల 70శాతం, ఈశాన్య రుతుపవనాల వల్ల 20 శాతం వర్షం కురుస్తోంది. మనిషికి జీవనాధారం నీరు. రుతుపవనాలు విఫలమై చినుకు చుక్క పడకపోతే కరువు కల్లోలపరుస్తుంది. ఆర్థిక వృద్ధి క్షీణిస్తుంది. జన జీవనం అస్తవ్యస్తమవుతుంది. 2002లో జరిగిందిదే!**

**రుతుపవనాలు విఫలంకావడంతో చినుకు చుక్క పడలేదు. దీంతో కరువు తాండవించింది. అంతటి ప్రాముఖ్యత కలిగిన రుతుపవనాలు అంటే ఏంటి? వీటిలో ఎన్ని రకాలు ఉన్నాయి? ఇవి ఎక్కణ్ణించి వస్తాయి? మన దేశంలోకే ఎందుకు ప్రవేశిస్తాయి? ఎల్‌నినో, లానినో ఎఫెక్ట్ అంటే ఏమిటి? ఈ ఏడాది వర్షపాతం ఎంత వుంటుంది?... వంటి వివరాలు అట్టమీది కథగా ఈవారం అందిస్తున్నాం.**

రుతుపవనాలంటే ఒక సీజన్‌లో వచ్చి, కొన్ని నెలలపాటు ఉండే గాలులు. రుతుపవనాలను ఇంగ్లీషులో 'మాన్‌సూన్'గా పిలుస్తారు. మాన్‌సూన్ అనే పదాన్ని మొదట భారతదేశం, పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లో ఉపయోగించారు. హిందూ మహా సముద్రం, అరేబియా సముద్రం నుంచి ఒక సీజన్‌లో నీటి ఆవిరిని మోసుకుంటూ వచ్చే గాలుల్ని 'మాన్‌సూన్'గా పేర్కొన్నారు.

ప్రపంచంలో భౌగోళిక స్వరూపం రీత్యా రుతుపవనాలు వచ్చేది తూర్పు ఆసియా, ఉత్తర అమెరికా, దక్షిణ అమెరికా, సబ్-సహారా ఆఫ్రికా, ఆస్ట్రేలియాలకు మాత్రమే. వీటిలో రుతుపవనాల ప్రభావం ఎక్కువ ఉండేది తూర్పు ఆసియా దేశాల్లోనే. అందులో రుతుపవనాల ద్వారా ఎక్కువ ప్రయోజనం పొందుతున్నది మనదేశమే.

దీనికి కారణం భౌగోళికంగా మన దేశం ఉన్న స్థానం. రుతుపవనాల ప్రవేశ ముఖద్వారంగా భారతదేశం ఉండడం. మన దేశానికి మూడు పక్కలా సముద్రాలు ఉండడం.. రుతుపవనాలు వర్షించడానికి కలిసొచ్చే అంశం.

మాన్‌సూన్ ఆంగ్ల పదం పోర్చుగీసులోని మోనకో అనే పదం నుంచి వచ్చింది.

ప్రపంచంలోని మిగతా దేశాల్లో శీతల వర్షాలు కురుస్తాయి. దీంతోపాటు తుపాన్ల ద్వారా వర్షం పడుతుంది. కొన్ని దేశాల్లో ఉత్తర ధ్రువం నుంచి వచ్చే చల్ల గాలులు ద్రవీభవించి, వర్షం కురుస్తుంది.

### నైరుతి రుతుపవనాలు

మన దేశంలో జూన్ నుంచి సెప్టెంబర్ వరకూ నైరుతి దిశ నుంచి వచ్చే గాలుల్ని నైరుతి రుతుపవనాలని అంటారు. మన దేశంలో 70 శాతం వర్షపాతం కురిసేది నైరుతి రుతుపవనాల వల్లే.

### ఎక్కడినుంచి వస్తాయి?

వాతావరణంలోని అన్ని మార్పులకూ మూలం భూమి గమనం, సూర్యుడి నుంచి వెలువడే ఉష్ణం. భూమి తన చుట్టూ తాను తిరుగుతూ సూర్యుడి చుట్టూ ఒక కక్ష్యలో తిరుగుతూ ఉంటుంది. భూమి పడమర నుంచి తూర్పు దిశకు తిరుగుతుంది. భూమధ్య రేఖ, కర్కాటక రేఖ, మకర రేఖ గురించి మనకు తెలుసు. భూమధ్య రేఖకు పైన ఉండేది కర్కాటక రేఖ, కింద ఉండేది మకర రేఖ. భూమి తనచుట్టూ తాను తిరుగుతూ, సూర్యుడి చుట్టూ తిరుగుతూ ఉన్న క్రమంలో ఒకసారి సూర్యుడికి ఎదురుగా భూమధ్య రేఖ, ఇంకోసారి కర్కాటక రేఖ, ఇంకోసారి మకరరేఖ వస్తాయి. సూర్యుడికి ఎదురుగా భూమధ్య

రేఖ వచ్చినప్పుడు భూమధ్య రేఖకు సమీపంలోని దేశాల్లో వేసవికాలం ఉంటుంది. అలాగే కర్కాటక రేఖ వస్తే ఆ రేఖకు సమీపంలోని దేశాల్లోనూ, మకర రేఖ వస్తే ఆ రేఖకు సమీపంలోని దేశాల్లోనూ వేసవికాలం వస్తుంది.

మన దేశం భూమధ్య రేఖకు కాస్త ఎగువన ఉంది. సూర్యుడు మనదేశానికి అభిముఖంగా వచ్చినప్పుడు మనకు వేసవి కాలం. ఆ సమయంలో భూమి దక్షిణార్ధగోళంలో శీతాకాలం ఉంటుంది. అంటే మనకు వేసవి అయితే, దక్షిణార్ధగోళంలో శీతాకాలం.

మనదేశంలో వేసవి కాలంలో సూర్యుడి గ్రీష్మానికి గాలి విపరీతంగా వేడెక్కుతుంది. వేడెక్కిన గాలి తేలికపడి, వాతావరణంలో పైకి వెళ్తుంది. దీంతో పీడనం ఏర్పడుతుంది. దీంతో దక్షిణార్ధగోళంలోని చల్లటి గాలులు ఈ ప్రాంతానికి వస్తాయి. ఈ గాలులు హిందూ మహాసముద్రం మీదుగా సుమారు మూడు వేల కిలోమీటర్లు ప్రయాణించి అరేబియా సముద్రం మీదుగా మనదేశంలోకి కేరళ వద్ద ప్రవేశిస్తాయి. హిందూ మహా సముద్రంలో వేల కిలోమీటర్ల దూరం ప్రయాణించిన గాలులు నీటి ఆవిరిని నింపుకుంటాయి. ఈ గాలులు మన దేశంలోకి ప్రవేశించి వర్షాల్ని అందిస్తాయి.

**మనదేశంలోకే ఎందుకంటే?**

నైరుతి రుతుపవనాలు మనదేశంలోకే ఎందుకు ప్రవేశిస్తాయంటే భూమి తిరుగుతున్న దిశే దీనికి కారణం. భూమి పడమర నుంచి తూర్పుకు తిరుగుతుండడంతో నైరుతి రుతుపవనాలు నైరుతి దిశ నుంచి మన దేశంలోకి ప్రవేశిస్తాయి.

నైరుతి రుతుపవనాలు ఆసియా ఖండంపైకి రావడానికి మరో కారణం ఆసియా ఖండంలో భూభాగం ఎక్కువ. ఫలితంగా ఇక్కడ వాతావరణం మిగతా ఖండాలతో పోలిస్తే ఎక్కువ వేడెక్కుతుంది. ఫలితంగా వాతావరణంలో గాలులు పైకి వెళ్లి, ఎక్కువ పీడనం ఏర్పడుతుంది. ఫలితంగా నైరుతి రుతుపవనాలు ఆసియా ఖండంపైకి మళ్లుతాయి.

**ఈ ఏడాది ముందుగా...!!**

నైరుతి రుతుపవనాలు సాధారణంగా మే 20న అండమాన్ దీవుల్ని తాకుతాయి. జూన్ 1న కేరళ, తమిళనాడు, దక్షిణాంధ్రల్లోకి ప్రవేశిస్తాయి. జూన్ 5న హైదరాబాద్‌తోపాటు తెలంగాణా, ఉత్తరాంధ్రలను తాకుతాయి. జూన్ 10 నాటికి మహారాష్ట్ర, ఛత్తీస్‌ఘడ్, ఒరిస్సా, జూన్ 15 నాటికి గుజరాత్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, జులై 1నాటికి రాజస్థాన్, హర్యానా, పంజాబ్, జమ్మూకాశ్మీర్‌ల్లోకి రుతుపవనాలు వ్యాపిస్తాయి. కొంచెం అటూఇటూగా జులై 15నాటికి దేశమంతటా రుతుపవనాల ప్రభావం ఉంటుంది.

**'ఎల్ నినో', 'లా నినో' ఎఫెక్ట్**

వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోతే రుతుపవనాల రాకలో జాప్యం లేదా పూర్తిగా విఫలమయ్యే ప్రమాదం ఉంటుంది. మనదేశానికి తూర్పున దూరంగా పసిఫిక్ మహాసముద్రంలో 'ఎల్ నినో' (బాక్స్‌లో వివరించాం) ఏర్పడితే మనదేశంపైకి వచ్చే రుతుపవనాలు పసిఫిక్ మహా సముద్రానికి వెళ్లిపోతాయి. మనదేశ వాయువ్య భాగంలోని రాజస్థాన్‌లో ఉన్న థార్ ఎడారి నుంచి వేడి గాలులు బలంగా ఉండి ఆగ్నేయ దిశకు ప్రయాణించినా రుతుపవనాలు నిలిచిపోతాయి. రుతుపవనాలు విజయవంతం కావాలంటే అరేబియా, బంగాళాఖాతం సముద్రాల్లో గాలులు బలంగా ఉండాలి. పసిఫిక్ మహా సముద్రంలో 'ఎల్ నినో' ఉండకూడదు. 'లా నినో' (బాక్స్‌లో వివరించాం) ఉండాలి. బంగాళాఖాతంలో అల్పపీడనాలు ఏర్పడాలి. పసిఫిక్ మహా సముద్రంలో ఎల్ నినో ప్రభావం వల్ల రుతుపవనాలు విఫలమై, మన దేశంలో కరువు తాండవించిన సందర్భాలు గతంలో ఉన్నాయి. వేల మంది ఆ కరువు బారిన పడి మృత్యువాతపడ్డారు.


కోల్‌కొతాలోని హౌరా బ్రిడ్జిపై నైరుతి రుతుపవన మేఘాలు

**ఈశాన్య రుతుపవనాలు**

సెప్టెంబర్ ప్రాంతంలో మనదేశానికి ఈశాన్య దిశ నుంచి వచ్చే గాలుల్ని ఈశాన్య రుతుపవనాలని అంటారు. చల్లగా ఉండే ఈ పొడిగాలులు తిరుగు ప్రయాణంలో బంగాళాఖాతంమీదగా వచ్చేటప్పుడు తిరిగి నీటి ఆవిరి వీటిలోకి చేరుతుంది. ఇవి తిరిగి భారతదేశ భూభాగంపైకి చేరిన తరువాత వర్షిస్తాయి. ఈశాన్య రుతుపవనాల వల్ల మన దేశంలో 20శాతం వర్షాలు కురుస్తాయి. ఈశాన్య రుతుపవనాల వల్ల తమిళనాడు, దక్షిణాంధ్ర ప్రాంతాల్లో ఎక్కువ వర్షాలు కురుస్తాయి. తమిళనాడులో 50 నుంచి 60 శాతం వర్షపాతం ఈశాన్య రుతుపవనాల వల్ల లభిస్తుంది.

**ఈ ఏడాది 96శాతం వర్షపాతం**

భారత వాతావరణ విభాగం ఏప్రిల్ 17న నైరుతి రుతుపవనాలకు సంబంధించి విడుదల చేసిన మొదటి దశ లాంగ్ రేంజ్ ఫోర్‌కాస్ట్‌లో నైరుతి రుతుపవనాల వల్ల ఈ ఏడాది సాధారణ వర్షపాతంతో పోలిస్తే 96శాతం వర్షపాతం ఉంటుందని అంచనా వేసింది. ఈ విభాగం జూన్‌లో రెండో దశ అంచనాలను విడుదల చేస్తుంది. భారత వాతావరణ విభాగం 2007, 2008ల్లో ఈశాన్య రుతుపవనాలకు సంబంధించి విడుదల చేసిన అంచనాలు వాస్తవానికి దగ్గరగా ఉన్నాయి. ఈ ఏడాది రుతుపవనాలు సాధారణ సమయం కంటే

## ఒరిస్సాను కుదిపేసిన సూపర్ సైక్లోన్

**1999 అక్టోబర్ 29న సైక్లోన్ 05బి సూపర్ సైక్లోన్ ఒరిస్సాను కుదిపేసింది. గంటకు 257 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. కేటగిరీ 5 హరికేన్‌తో సమానమైన సైక్లోన్‌గా దీన్ని పేర్కొన్నారు. ఈ తుపాను ప్రభావానికి సుమారు రెండు లక్షల మంది నిరాశ్రయులయ్యారు. అధికారిక లెక్కల ప్రకారం 9,803 చనిపోయారు.**



## టోర్నడో

**టోర్నడో అంటే సుడిగాలి. గంటకు 200 నుంచి 300 కిలోమీటర్ల వేగంతో ఉంటుంది. గంటలకు 50 కిలోమీటర్ల వేగంతో వీచే గాలుల్లోనే మనిషి ముందుకు నడవడం కష్టం. టోర్నడో వస్తే ఆ సుడిలో ఏదీ మిగలదు. మన దేశంలో టోర్నడోలు వచ్చే అవకాశం తక్కువని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. వస్తేగిస్తే ఒరిస్సా, పశ్చిమ బెంగాల్‌లలో ఇవి రావచ్చు. ఎండాకాలంలో ఉరుములతో కూడిన జల్లులు కురిసేటప్పుడు అప్పుడప్పుడూ రోడ్లపై చెత్త సుడిలో తిరుగుతూ కనిపిస్తుంది. దీని వ్యాసార్థం చిన్నదిగా ఉంటుంది. దీన్ని మన సుడిగాలి అంటాం. టోర్నడోల వ్యాసార్థం సుమారు అయిదు కిలోమీటర్లు ఉంటుంది. ఇది ఏ ప్రాంతంలో వస్తుందో చెప్పడం కష్టం. టోర్నడోలు ఎక్కువగా వచ్చే అమెరికాలాంటి దేశాల్లో దీని దిశను రాడార్ వ్యవస్థ ద్వారా గుర్తించి ప్రజలకు సమాచారాన్ని అందిస్తున్నారు.**

# 'ఎల్ నినో' అంటే?

పసిఫిక్ మహా సముద్రంలో భూమధ్య రేఖకు దిగువన సముద్ర జలాల ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి కంటే ఎక్కువ ఉండడాన్ని 'ఎల్ నినో' అంటారు. 'ఎల్ నినో' అన్నది స్పానిష్ పదం.

పసిఫిక్ మహా సముద్రంలో ఏర్పడే ఎల్ నినో మన దేశంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. మన దేశానికి తూర్పు వైపున దూరంగా ఉన్న పసిఫిక్ మహాసముద్రంలో ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి కంటే ఎక్కువ ఉంటే అక్కడి గాలులు వాతావరణంలో పైకి వెళ్తాయి. ఫలితంగా ఏర్పడిన పీడనానికి ఆ ప్రాంతంలో తుపానులు ఏర్పడతాయి. దీంతో మన దేశంపైకి వచ్చే రుతుపవనాలు ఎల్ నినో ప్రాంతానికి వెళ్లిపోతాయి. దీని వల్ల మనదేశానికి రుతు పవనాలు రావు. దీంతో వర్షాలు పడవు. ఫలితంగా కరువు పరిస్థితులు ఏర్పడతాయి.

# 'లా నినో' అంటే?

'లా నినో' అంటే సరిగ్గా 'ఎల్ నినో'కి వ్యతిరేకంగా ఉంటుంది. సముద్ర జలాల ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి కంటే తక్కువ ఉండడాన్ని 'లా నినో' అంటారు. 'లా నినో' పరిస్థితులు మనకు ఉపయోగపడ్తాయి. పసిఫిక్ మహా సముద్రంలో లా నినో పరిస్థితులు ఉంటే, రుతుపవనాలు మన దేశంలో యథాతథంగా విస్తరిస్తాయి. మనదేశంలోకి నైరుతి రుతుపవనాల ప్రవేశంపై, దూరంగా ఉన్న పసిఫిక్ మహా సముద్రంలో 'ఎల్ నినో', 'లా నినో'ల ప్రభావం ఎంతో ఉంది.

ముందే దేశంలోకి ప్రవేశించాయి. అండమాన్ దీవుల్ని మే 20కి చేరాల్సి ఉండగా, అప్పటికే అండమాన్ దీవుల్ని దాటి కొంత ముందుకు వచ్చాయి. జూన్ 1 నాటికి కేరళను తాకాల్సి ఉండగా, మే 23 నాటికే కేరళ, తమిళనాడు, మే 25 నాటికి కర్ణాటకను తాకాయి.

నైరుతి రుతుపవనాలు మరీ ముందుగా 1960లో మే 14న కేరళలోకి ప్రవేశించాయి. బాగా ఆలస్యంగా 1972లో జూన్ 18న కేరళను తాకాయి.

**నార్త్ అమెరికా మాన్‌సూన్**

జూన్ లేదా జులై మొదటివారంలో నార్త్ అమెరికా మాన్‌సూన్ అమెరికాలోకి ప్రవేశిస్తుంది. జులై 15 నాటికి అమెరికా నైరుతి భాగానికి విస్తరిస్తుంది. మెక్సికో, ఆరిజోనా, న్యూ మెక్సికో, నెవాడ, కొలొరాడో, వెస్ట్ టెక్సాస్, కాలిఫోర్నియా ప్రయోజనం పొందుతాయి. దీన్నే మెక్సికన్ లేదా ఆరిజోనా మాన్‌సూన్ అని పిలుస్తారు.

**2002లో ఏం జరిగింది?**

2002లో దేశమంతా దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయి. దీనికి కారణం ఆ ఏడాది వర్షాలు లేవు. నైరుతి రుతుపవనాలు విఫలమయ్యాయి. 2002లో బంగాళాఖాతంలో ఒక్క వాయుగుండం కూడా ఏర్పడలేదు. పసిఫిక్ మహా సముద్రంలో ఎల్ నినో ప్రభావం ఉంది. ఫలితంగా 2002లో రుతుపవనాలు విఫలమయ్యాయి.

**బ్రేక్ మాన్‌సూన్**

**యాక్టివ్ మాన్‌సూన్**

నైరుతి రుతుపవనాలు దేశమంతటా వ్యాపించిన తరువాత హిమాలయాలకు చేరుకున్న తరువాత ఆ ప్రాంతంలో వర్షాలు అధికంగా కురుస్తాయి. మిగతా ప్రాంతాల్లో వర్షపాతం తగ్గిపోతుంది. దీన్నే బ్రేక్ మాన్‌సూన్ అంటారు. ఆ సమయంలో అల్ప పీడన ద్రోణి ఏర్పడితే హిమాలయాల వద్ద అత్యధిక వర్షపాతం నమోదవ్వడంతోపాటు, దీని ప్రభావం మైదాన ప్రాంతంలోని రాజస్థాన్ నుంచి పశ్చిమ బెంగాల్ మీదుగా ఉత్తర బంగాళాఖాతం వరకూ వ్యాపిస్తుంది. దీన్ని యాక్టివ్ మాన్‌సూన్ అంటారు.

**ఐదారు కిలోమీటర్ల ఎత్తులో మేఘాలు**

నైరుతి రుతుపవనాల సమయంలో మేఘాలు తక్కువ ఎత్తులో అంటే భూమికి ఐదారు కిలోమీటర్ల ఎత్తులో ముందుకు సాగుతూ వర్షాన్ని అందిస్తాయి. వాయుగుండం, తుపాన్లు వంటివి ఏర్పడినప్పుడు మేఘాలు 12 కిలోమీటర్ల ఎత్తులో ఉంటాయి. ఇంత ఎత్తులో మేఘాలు ఉన్నప్పుడు మెరుపులు, ఉరుములు పుడతాయి. ఇటువంటి మేఘాలు రుతుపవనాలు రాక ముందు అంటే మే నెలలో ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది. ఉరుములతో కూడిన జల్లులు, పెనుగాలులు కూడా ఈ సమయంలో వస్తాయి. ఒక్కొక్కప్పుడు ఈ పెనుగాలుల వేగం గంటకు వంద కిలోమీటర్ల వరకూ ఉంటుంది.

**సీ బ్రీజ్ అంటే?**

సముద్ర గాలులు భూమి మీదకు రావడాన్నే సీ బ్రీజ్ అంటారు. సముద్ర తీర ప్రాంతాల్లో ఈ వాతావరణం కనిపిస్తుంది. మధ్యాహ్నం వరకూ భానుడి ప్రతాపానికి భూమిపై వాతావరణం వేడెక్కుతుంది. వేడెక్కిన గాలులు వాతావరణంలో పైకి వెళ్తాయి. దీంతో పక్కనే ఉన్న సముద్రం నుంచి చల్లటి గాలులు భూమిపైకి వచ్చి, వాతావరణాన్ని చల్లబరుస్తాయి.

**వడగళ్లు**

మేఘాలు చాలా ఎత్తు వరకూ ఏర్పడినప్పుడు భూమికి ఆరు కిలోమీటర్లకంటే పైన ఉన్న మేఘాల్లో నీటి ఆవిరి ఘనీభవించడం వల్ల మంచుగడ్డలు ఏర్పడతాయి. మేఘాలు వర్షించినప్పుడు ఈ మంచుగడ్డలు కిందపడతాయి. చాలా మంచుగడ్డలు వాతావరణంలోనే కరిగిపోయి, తిరిగి నీటి ఆవిరిగా ఏర్పడతాయి. కొన్ని మంచుగడ్డలు భూమిని తాకుతాయి. వీటిని వడగళ్లు అంటారు. వడగళ్ల వాన ఎక్కువగా ఎండాకాలంలో, నైరుతి రుతుపవనాలకు ముందు పడుతుంది.




**థార్ ఎడారి నుంచి వేడి గాలులు**

వేసవిలో బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందంటే రాష్ట్రంలో ఎండలు మండినట్టు లెక్కే. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వల్ల వాయువ్య భారత దేశంలో ఉన్న రాజస్థాన్ లోని థార్ ఎడారి నుంచి వేడి గాలులు రాష్ట్రంలోకి ప్రయాణిస్తాయి. ఫలితంగా రాష్ట్రంలో వాతావరణం వేడెక్కుతుంది. వారం రోజుల క్రితం రాష్ట్రంలో జరిగినదిదే. బంగాళాఖాతంలో 'ఐలా' తుపాను కారణంగా వాయువ్య భారత దేశంలోని థార్ ఎడారి నుంచి వేడి గాలులు రాష్ట్రంలోకి ప్రవేశించాయి. ఫలితంగా రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు అనూహ్యంగా పెరిగాయి.

★

# చిరపుంజి రికార్డు

ప్రపంచంలో అత్యధిక వర్షపాతం కురిసే ప్రాంతంగా మనకు చిరపుంజి గురించి తెలుసు. ఇది ఈశాన్య రాష్ట్రమైన మేఘాలయలో ఉంది. చిరపుంజి సగటు వర్షపాతం 11,430 మిల్లీమీటర్లు. ఇక్కడ సగటు వర్షపాతం 11,873 మిల్లీమీటర్లు.

చిరపుంజి రెండు సార్లు గిన్నిస్ బుక్ రికార్డుల్లోకి ఎక్కింది. 1860 ఆగస్టు, 1861 జులై మధ్య ఏడాది కాలంలో చిరపుంజిలో అత్యధిక వర్షపాతం 22,987 మిల్లీమీటర్లు నమోదైంది. ఒక నెలలో.. 1861 జులైలో 9,299.96 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఈ రెండు రికార్డులూ గిన్నిస్ బుక్‌లోకి ఎక్కాయి.

# మట్టితో నా ఒప్పందం.....

**జి. లెనిన్ శ్రీనివాస్**

కవిత్వం

**మ**ట్టిపై  నా కన్నా
మట్టికి నా పైనే మక్కువ
మట్టి మౌనంగానే వుంటుంది!
అది సహన శీలి!
ఒట్టేసినా తిట్టి పోసినా
మట్టిని నమ్మితే మోసం చేయదు
మట్టి స్నేహశీలి!
దానికి మానవత్వం తప్ప
దాన గుణం తప్ప
కుట్ర తెలియదు-
మట్టికి కులము, మతమూ లేదు
దానికి వర్ణము, వర్గమూ లేదు
అంతరం, అంతస్థు ఎరుగదు
శ్వాస విడిచిన జీవులకు శాశ్వత నిద్రకై
మట్టితల్లి ఒడిలోనే సేదతీరేది!
అది కోరిన పంటలతో
కోరిక తీర్చేకల్పవల్లి!
నిరంతరం మౌనంగా శ్వాసించే
మానవ వికాస, ఉజ్వల భవిష్యదాకాంక్షి
తప్పటడుగువేసే ప్రాయాలను
హత్తుకుని తనివితీరా ముద్దాడుతుంది!
మట్టి ఆత్మీయత కురిపించే అమ్మ చేతి స్పర్శ!
మట్టి దయాశీలి!
మట్టికి నాకు మధ్య అనాది ఒప్పందం
నేను ఒంటరి దు:ఖాన్నై
నా అర చేతులు గుండెల్ని
తాకుతున్న ప్రతిసారీ
కన్నతల్లై ఒడికి  చేర్చి
మట్టి ముద్దల్ని ఓదార్చాలనీ...
గాలి మూగబోయినా....
వాయులీనానికి తోడు నిలవాలని
మట్టికి నాకు మధ్య అనాది ఒప్పందం!
ఇకెప్పటికీ చింతలేదు
నా నిలువెత్తు సంతకాన్ని
సంస్కరించే బాధ్యత మట్టిదే....!

# అలల అంచున కలల పడవ

**- సి. కామేశ్వరరావు**

**నీ**వు కన్న కలలు
అలలపై నురగలా తేలిపోతాయి
వల చిక్కుముడులు విప్పే నీవు
నీ బతుకు ప్రవాహసుడుల్ని విప్పుకోలేవు
దినదిన గండం నూరేళ్ళాయువన్నట్లుగా
బతుకంతా వెతల అలలలో వెతుకులాటే!
గాఢాంధకారంలో సముద్ర ఘోష తప్ప
ఒక్క ఆపన్న హస్తం నిన్నాదుకోదు
దగుల్బాజీ దళారీ చేతిలో దగాపడ్డ తమ్ముడా!
నీ రెక్కల శ్రమ దోపిడి నిజంగా అమానుషం
నీ ప్రాణవాయువులు అలలపై తేలి
ప్రకృతి వైపరీత్య బీభత్సంలో
బతుకు తెరచాప చిరిగి సాగితే
నీ కన్నీరు తుడిచిన కరుణామయుడుండడు
నోటికింత కూడు అందించే చెట్టంత కొడుకు
దైనందిక జీవన వేటలో అసువులు కోల్పోతే
ప్రాణానికి వెలకట్టే అనాగరిక లోకంలో
నీ గుండె చప్పుడు ఆలకించే నాయకుడుండడు
నీ చెమట చలువతో కట్టుకున్న గూడు
అకాల తుఫానుకు అల్లాడి పోతే
వెర్రి చూపులతో నీ కనులు దిక్కుల్ని పరామర్శిస్తే
శీతల జల కరస్పర్శకు ముగ్ధుడవై
మైమరచిపోయే అల్ప సంతోషివి నీవు
ఇల్లాలి మంగళసూత్రాన్ని యముని చేతికిచ్చి
ఆమె నుదుట కర్మ సిద్ధాంతం రాసిన అమాయకుడవు నీవు
విశాలమైన ఆకాశం నీలి నీడలో
అలసిన శరీరాన్ని ఆరబోసి
అంతరంగాన్ని అవలోకించినపుడు
నీ కంటి పాపలో శూన్యం నిద్రిస్తుంది
కోస్టల్ కారిడార్ ఉచ్చుల పథకంలో
నీ కలల తీరం కనుమరుగవుతుంది
నాయకుల మాటలు సిరిమూటలు కావన్న సంగతి
నీకు అనుభవైక వేద్యమే కదా!
నూరేళ్ళ బతుకులో నూకల గంజికై నిరంతరం మృత్యువుతో నీ పోరాటం
ఏ నాయకునికి వినిపిస్తుంది నీ ఆకలి కథ!
కఠిన చిత్తుని కరిగిస్తుంది నీ మనోవ్యధ!!
అందుకే....
జాతి చైతన్య కేతనాన్ని ధరించు!
పూతరేకులాంటి భవిష్యత్తును నిర్మించు!!

# కాలుష్యం... ఎంత కఠినం?!

కాలుష్యం. ఈ పదమే కటువుగా, ప్రాణాంతకంగా అనిపిస్తుంది కదూ. దీని బారినుండి తప్పించుకున్న వారు దాదాపు లేనట్లే. సగటు మానవుడు ఆధారపడే ప్రతి అంశం కాలుష్యంతో కొట్టుమిట్టాడుతోంది. విశేషమేమిటంటే రోజురోజుకూ కాలుష్యంపై అవగాహన, సమాచారం, విశ్లేషణ, హెచ్చరికలు, నివారణా పద్ధతులూ, నిరోధ ప్రణాళికలూ, చర్చలూ... వంటివి పెరుగుతూనే ఉన్నాయి. వాటికంటే వేగంగా కాలుష్యమూ విస్తరిస్తోంది. ఎటొచ్చీ కాలుష్య ప్రభావం మాత్రం తగ్గే సూచనలే కన్పించకుండా పోతున్నాయి.

**- డా॥విజయ్**

**గా**లి, నీరు, నేల - వాటితో పాటు వాటిలో నివశించే, లేదా వాటిపై ఆధారపడే ప్రతి జీవీ - కొన్ని సందర్భాలలో నిర్జీవ వస్తువులు కూడా - కాలుష్యానికి చిక్కి సమస్యలనెదుర్కొంటున్నాయి. ఎంతో 'అభివృద్ధిచెందినవని గొప్పలు చెప్పుకునే దేశాలు కూడా ఆ అభివృద్ధిలో భాగంగానే కాలుష్యాన్ని వృద్ధి చేయడం విశేషం. అలాగని పల్లెలు (అభివృద్ధికి దూరంగా వుంటాయని భావించి), నిరుపేద దేశాల్లో కాలుష్యం కాలిడలేదని కాదు, మానవ మాత్రులు కాలిడటానికి వీలులేని అంటార్కిటిక్, ఆర్కిటిక్ ఖండాలనుండి అంతరిక్షం వరకూ అది వ్యాపించింది. వీటిలో నగరాలేపాటివి?

నగరాల్లో కాలుష్యం విశ్వరూపం ప్రదర్శిస్తోంది. తక్కువా, ఎక్కువా అనే అంశాన్ని పరిశీలించాలే తప్ప కాలుష్యం లేని నగరం ఎక్కడా లేదంటే అతిశయోక్తికాదు.

కాలుష్యానికి కారణాలను ఈ మధ్యకాలంలో స్కూలు పిల్లలు కూడా చకచకా వల్లిస్తున్నారు. మోటారు వాహనాలనో, పరిశ్రమలనో, డ్రైనేజీలనో, చెట్లు తగ్గిపోవడమనో తడుముకోకుండా చెప్పేస్తున్నారు. ఫలానావి నియంత్రిస్తే ఫలానా సమస్య పోతుందని వ్యాసాలూ, పాఠాలూ కూడా ఘోషిస్తున్నాయి. కానీ ఏవైనా ఆచరణలోకి వచ్చాయా? తత్ఫలితంగా కాలుష్యం కాస్తయినా తగ్గిందా? ఈ ప్రశ్నలకి జవాబు అనూహ్యం కాదు.

మనలోని ద్వంద్వ ప్రవృత్తి, మన జీవనశైలి, మన స్వార్థతత్వం, సంకుచిత దృష్టి వంటివే మన వినాశనానికి మూలమని విపులీకరించనవసరం లేదు. అవే ప్రస్తుత పరిస్థితికి కారణాలు. ప్రపంచ ఆరోగ్య సంస్థ అధ్యయనాల ప్రకారం ఆసియాలో వాయు కాలుష్యం అతి తీవ్రంగా ఉంది. దాని కారణంగా ఏటా దాదాపు 8 లక్షల మరణాలు సంభవిస్తున్నాయి. పైగా, వాటిలో ఎక్కువ శాతం ఆసియాలోని అభివృద్ధి చెందిన దేశాల్లోనేనట!

**వాయుకాలుష్యం సంగతో**

వాయు కాలుష్యం అనగానే ముందుగా గుర్తుకువచ్చేది మోటారు వాహనాలే. అంటే నగరాలే! మన దేశ జనాభాలో పావుశాతం నగరాల్లోనే విస్తరిస్తుంది. ప్రణాళిక లేకుండా అడ్డదిడ్డంగా పెరిగిపోయిన నగరాల వలన ఒక పక్క మురికి వాడలూ, రవాణా అవసరాలూ కూడా విచ్చలవిడిగా పెరిగిపోయాయి. రవాణా కారణంగానే అత్యధికంగా వాయుకాలుష్యం జరుగుతోందన్నది నిర్వివాదాంశం (వాహనాల వలనే ప్రమాదాల కారణంగా కూడా మరణాలు ఎక్కువ సంభవిస్తున్నాయన్నది మరో గమనించవలసిన అంశం).

మన దేశంలోని మహానగరాల్లో ఒక దశాబ్దకాలంలోనే వాహనాల సంఖ్య (రిజిష్టరు అయినవి) దాదాపు ఐదింతలు పెరిగింది. మరో విశేషం ఏమిటంటే వాహనాల్లో ఎక్కువ శాతం దాదాపు 65 శాతం ద్విచక్ర వాహనాలూ, త్రి చక్ర వాహనాలు. సాధారణంగా ద్విచక్ర, త్రి చక్ర వాహనాలు ఎక్కువ సంఖ్యలో ఉండటమే కాక ఎక్కువగా తిరుగుతుంటాయి కూడా - మైలేజీ కారణంగా. అందువల్ల వాయు కాలుష్యం వీటినుండే ఎక్కువగా వెలువడే వీలుంది. అయితే పెట్రోలు వాహనాల కంటే డీజిలు ఇంజన్లు ఎక్కువ కాలుష్యాన్ని వెదజల్లుతున్నాయన్నది సత్యం. నాలుగు చక్రాల వాహనాల్లో ఎక్కువ శాతం భారీ రవాణా వాహనాలు వంటివి అధికంగా డీజిల్ ఇంధనం పైనే ఆధారపడతాయి. ఇలా మోటారు వాహనాల నుండి వచ్చే కర్బన సంబంధ కాలుష్యాలను అరికట్టే దిశగా 4 స్ట్రోక్ ఇంజన్లు, సి.ఎన్.జి (సహజ వాయు) ఇంజన్లు వచ్చినా, కాలుష్యం మాత్రం యథావిధిగా పెరుగుతూనే ఉంది. ప్రభుత్వాలు కాలుష్య నియంత్రణ కొరకు 'పొల్యూషన్ అండర్ కంట్రోల్' అనే ఒక సర్టిఫికెట్ ఇవ్వడం కోసం కాలుష్య పరీక్షలు వాహనాలకి తప్పనిసరి అని తాఖీదులిచ్చాయి. కానీ ముందు సర్టిఫికెట్టూ ఉంటుంది, వెనుక కాలుష్యమూ అలాగే ఉంటుంది! ఇలా కాలుష్యాన్ని వెదజల్లేవి ఎక్కువగా పాతకాలపు ప్రభుత్వ వాహనాలు, ప్రభుత్వ రవాణా వాహనాలే.

**శబ్ద కాలుష్యం మాటో**

వాహనాల వల్ల వాయుకాలుష్యమొక్కటే కాదు - శబ్ద కాలుష్యం కూడా ఉంది. ఎక్కడైనా రద్దీ కూడలిలో సిగ్నల్ కోసం ఆగిన వాహనాల సమీపంలో



నిలబడితే తెలుస్తుంది ఆ శబ్ద కాలుష్య తీవ్రత. సిగ్నల్ పడటానికి నిమిషానికి పైగా (కొన్ని కూడళ్లలో) సమయమున్నా ఇంజన్లని ఆపకపోవడం, పైపెచ్చు ఇంజను రైజ్ చేయడం వల్ల వాయుకాలుష్యంతో పాటు చిరాకెత్తించే శబ్దం వెలువడుతుంది. వీటికి తోడు అవసరం లేకపోయినా హారన్‌లు మోగించడం నగరవాసులకి సరదా అయిపోయింది. కాకపోతే అందువల్ల వెలువడే కాలుష్యం గురించీ, దాని ప్రభావాల గురించీ పట్టించుకోరు.

**ధూళి సమస్య**

వాహనాల వల్ల తెలియకుండా ఏర్పడే మరో పరిస్థితి ధూళి సమస్య. కంటికి కనిపించని కార్బన్‌మోనాక్సైడ్ వంటి వాయువుల వలన వచ్చే ఆరోగ్య సమస్యల కంటే త్వరగా ధూళి సమస్యలని కలిగిస్తుంది. వాహనం వెళ్లిన ప్రతిసారీ దాని పొగ నుండే కాక రోడ్డు మీద దుమ్ము రేగి సుదూరంగా వ్యాపించడం మనకు తెలిసిందే. అలా రేగిన దుమ్ము ఇంట్లో వస్తువులపై పేరుకు పోవడం, వస్త్రాల్లో ఇంకి పోవడమూ తెలుసు. కానీ అంతకంత ధూళి మన ఊపిరితిత్తుల్లోకి వెళ్లడం స్పష్టంగా తెలీదు. అటువంటి ధూళి వల్లనే అలర్జీతో పాటు అనేక శ్వాస సంబంధ సమస్యలూ తలెత్తుతాయి. మన దేశంలో ఢిల్లీ, కోల్‌కొతా నగరాల్లో ఈ ధూళి కాలుష్యం తీవ్రంగా ఉంది. రోడ్లని శుభ్రంగా – నిజంగా శుభ్రంగా చేయగలిగితే ధూళి సమస్యను నిర్మూలించడం తేలిక. కానీ అటువంటి శుభ్రత జరగటం లేదన్నది వాస్తవం. రోడ్లను ఊడ్చేందుకు చిత్ర విచిత్ర వాహనాలని వినియోగించినా కూడా సమస్య అలాగే పాతుకుపోయి ఉంది. నగర రోడ్లకు నిత్యం తవ్వకాల తాకిడి ఉండనే ఉంది. ఆ కారణంగా ట్రాఫిక్‌కి అంతరాయం ఒక కోణమైతే, తవ్వి వదిలేసిన మట్టి కారణంగా ధూళి పెరగటం మరో కోణం. పూనుకుని ఒకసారి ధూళి కారణాలను తొలగొస్తే పరిస్థితి గణనీయంగా మెరుగవ్వడం అసాధ్యమేమీ కాదు.

ఢిల్లీలో సుప్రీం కోర్టు జోక్యం చేసుకుని స్వచ్ఛమైన కాలుష్యాన్ని తక్కువ కలిగించే ఇంధనాలనీ, ఎమిషన్ టెక్నాలజీలనీ నిర్బంధం చేయకపోతే ఇప్పటికన్నా దాదాపు 40 శాతం ఎక్కువ కాలుష్యం దేశ రాజధానిలో వుండేది. ఢిల్లీ గాలి ఈనాడు సి.ఎన్.జి బస్సులు, ఆటోల వల్ల కాస్త మెరుగ్గానే ఉంది. కానీ ధూళి మాత్రం అలాగే ఉంది. మన రాష్ట్రంలో కూడా ముఖ్యంగా రాజధానిలో గ్యాస్‌తో నడిచే ఆటోల సంఖ్య ఎక్కువగానే ఉన్నా కాలుష్యాన్ని తగ్గించే స్థాయికి మాత్రం చాలా దూరంగా ఉన్నాం.

**వాహనాల రొద**

నగరాల్లో వాహనాల వల్ల అనేక సమస్యలున్నాయి. దేశం మొత్తంలోని కార్లలో ఆశ్చర్యంగా 17 శాతం ఒక్క ఢిల్లీలో ఉన్నాయి! ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకున్న కారు నాలుగింతల కాలుష్యాన్ని వెదజల్లుతుందని తేలింది. ఆ లెక్కన హైదరాబాదు నగరంలో ఆఫీసు వేళల్లో ఎంత కాలుష్యం విడుదలౌతుందో అంచనా వేయవచ్చు. ద్విచక్ర, త్రిచక్ర, నాలుగు చక్రాల వాహనాలు రోడ్డుని దాదాపు 90 శాతం ఆక్రమించుకుంటాయి. తక్కువ ప్రయాణీకులని తీసుకువెళతాయి. ఎక్కువ కాలుష్యాన్ని కలిగిస్తాయి. ఇటువంటి వ్యక్తిగత వాహనాల కారణంగా ప్రజారవాణా వ్యవస్థ చాలా నగరాల్లో బలహీన పడుతోంది. అయినా బస్సులు దాదాపు 60 శాతం రవాణా అవసరాలని తీర్చుతున్నాయి. కానీ ట్రాఫిక్‌లో అవి 3-4 శాతం మాత్రమే ఆక్రమిస్తున్నాయి! అయినా ప్రజారవాణాకి పన్ను తాకిడి వ్యక్తిగత కార్ల పన్నుకంటే ఎక్కువ! ట్రాఫిక్ సమస్యనీ, తద్వారా కాలుష్య సమస్యనీ తగ్గించే విధంగా ప్రభుత్వాలు ప్రజారవాణా వ్యవస్థను మెరుగుపర్చడం మాని ఫ్లైఓవర్లు వంటి కొత్త రోడ్ల నిర్మాణం చేపట్టడం వల్ల అదనంగా ఒనగూడే ప్రయోజనమేదీ కనిపించదు. ప్రతి 10శాతం రోడ్ల పెరుగుదలకి 9 శాతం ట్రాఫిక్ పెరుగుతోంది. నిత్యం పుట్టుకొస్తున్న కొత్త కొత్త వాహనాలు వ్యక్తిగత హోదాను పెంచుతాయన్న దృష్టితో (అవసరం ఉన్నా లేకున్నా) కొనుగోళ్లు జరుగుతుంటే నగరాల్లో రోడ్లు ఎన్ని వేసినా సరిపోవు.

**సమస్యకు విరుగుడు చెట్లే**

వాయు కాలుష్యానికి సమర్థవంతమైన విరుగుడు చెట్లు. కాలుష్యాన్ని చెట్లు తగ్గించకపోయినా, దాని ప్రభావాన్ని మాత్రం గణనీయంగా అరికడతాయి. కానీ నగరాల్లో చెట్లు అరుదైపోయాయి. అందుకు కారణాలు అనేకం ఉన్నా, ప్రభావం మాత్రం ప్రతికూలంగానే పరిణమించింది. చెట్లు ఉన్న ప్రాంతాల్లో కూడా కాలుష్య తీవ్రతకు అవి మరింత బలహీనపడి పోతుండటం గమనిస్తాము. కొత్తగా రూపొందుతున్న టౌన్‌షిప్‌లు, అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలు కూడా చెట్లను 'విరివిగా' పెంచడంపై దృష్టి సారించడం లేదు. కొన్ని చోట్ల ఆర్భాటంగా ఆరంభించినా, మొక్కల ఆలనా పాలనా మధ్యలోనే ఆగి చెట్ల వరకూ ఎదగనీయడం లేదు.

నగరాలు రంగుల మిఠాయిలు. సూదంటురాళ్లు. అందర్నీ ఇట్టే ఆకర్షించడమే కాకుండా వచ్చిన వాళ్లని అట్టే పెట్టుకుంటాయి. ఒకసారి వాటి మాయాజాలంలో పడినవాళ్లు పడుతూ, లేస్తూ, తిడుతూ, విసుగుతూ బతికేస్తారు గానీ విడిచి పోరు. నిత్యం జరిగే ఈ 'ఆకర్షణ' కార్యక్రమంలో నరరాలు పెగరగటం లేదు. – స్థూలకాయులుగా మారుతున్నాయి. అది ఆరోగ్యకరమైన పెరుగుదలా?, హానికరమైన ఊబకాయమా? అన్నది పక్కన పెడితే జీవన నాణ్యతనూ, జీవిత కాలాన్నీ హరింపచేసుకుంటున్నామన్న స్పృహ నగరవాసులకి తక్కువ. వచ్చాం కదా బతికేద్దాం, వాహనం కొన్నాం కదా నడిపేద్దాం, కాలుష్యం ఉంది కదా పీల్చేద్దాం అంటూ సర్దుకుపోతున్నాం – ఆ కారణాలని సరిదిద్దలేకపోతున్నాం.

ఇప్పటి వరకూ నగరాల్లో వాహనాల ద్వారా వచ్చే వాయు కాలుష్యం గురించే మాట్లాడుకున్నాం. ఇక జల కాలుష్యం, చెత్త సమస్యల పరిధి దీనికి ఏమాత్రం తక్కువ లేదు. కాలుష్యాన్ని ఎలా తగ్గించాలా అన్న 'కిటుకులు' ఎవరికీ కొత్తకాదు. కాకపోతే వాటిని పాటించడమే అసలు కిటుకన్న విషయం విస్మరిస్తున్నాం.

మనల్ని రక్షించుకోవడానికి బలిష్టమైన గోడలు, తాళాలూ, ప్రహరీలూ, కంచెలూ, కోటలూ నిర్మించుకుంటున్నాం. అవన్నీ దాటి వచ్చి హతం చేయగల కలుషిత గాలిని గమనించామా? వాహనంపై ప్రయాణిస్తూ ప్రాణాల్ని కాపాడుకోవడానికి తలకి హెల్మెట్లు, మొలకి సీటు బెల్టూ బిగిస్తున్నాం. మనతో పాటు మిగతా వారు విడుదల చేసే కాలుష్యాలు నెమ్మదిగా మన ప్రాణాలు తీస్తున్నాయని గ్రహిస్తున్నామా? వీటిని గమనించినా, గ్రహించినా ఏం చేస్తున్నాం? పరిష్కారాలు పాఠ్య పుస్తకాల్లో ఉన్నాయి. అవి బట్టీ పెట్టేందుకే పనికి వచ్చాయన్నది అర్థమైంది. చేతల్లో ఏదైనా చేద్దాం. పర్యావరణాన్ని పరిరక్షించడం అన్న పెద్ద మాటల్ని పక్కన పెడదాం. నగరాన్ని నందనవనాన్ని చేద్దామనే ఆలోచనల్ని ఆపేద్దాం. కాలుష్యాన్ని ఎదుర్కొని కనీసం మనల్ని మనం కాపాడుకుందాం.

★

## క్రైమ్ కథ

# గుట్టు

- యర్నాగుల సుధాకరరావు

అర్ధరాత్రి ఇన్‌స్పెక్టర్ ఫైలు తిరగేసి లేచాడు. కునికిపాట్లు పడుతున్న వేన్ డ్రయివర్ కళ్లు నులుముకుంటూ లేచాడు. ఠాణాకు రోడ్లమీద ఊరకుక్కల అరుపులు విన్పించసాగాయి. అంతలోనే ల్యాండ్‌ఫోన్ మోగింది. ఇన్‌స్పెక్టర్ రిసీవర్ ఎత్తాడు. అవతల నుంచి "సార్ ఇక్కడో హత్య జరిగింది. వివరాలు రాసుకోండి" అవతల గొంతు ఏదో రుమాల్ అడ్డం పెట్టుకున్నట్టు మాట్లాడుతుంటే ఇన్‌స్పెక్టర్ నిద్ర మత్తు వదిలింది. ఆవెంటనే అలర్టు అయ్యాడు."సారీ ఇది పోలీస్ ఠాణా కాదు. రాంగ్ నెంబర్" అని పెట్టేసాడు.

రెండు నిముషాల్లో మళ్లీ ఫోన్ మోగింది.

"సార్ ఇన్‌స్పెక్టర్‌గారా? ఇక్కడ జవహర్‌కాలనీలో హత్య జరిగింది. చంపింది ఎవరనేది మాకు తెలుసు. వివరాలు నోట్ చేసుకోండి" మరింత ఆత్రం ఆగొంతులోంచి వెలువడింది.

అవతలివైపు నుంచి గొంతులో ఆత్రం గమనించి వెంటనే ఇన్‌స్పెక్టర్ "సారీ ఇది పోలీసుల నెంబర్ కాదు బంగారంలాంటి నిద్ర చెడగొట్టారు" ఫోన్‌లో రుసరుసలాడి పెట్టేసాడు.

మళ్లీ మోగింది. ఇన్‌స్పెక్టర్ రిసీవర్ ఎత్తి చెవికి అదుముకుని చేత్తో మౌత్ మూసేసి చెవులు రిక్కించాడు. అవతల నుంచి "ఏమిట్రా ఈలాండ్ లైన్లు సరిగ్గా పనిచేసి చావడంలేదు.అవతల రిసీవర్ ఎత్తాడంటే రాంగ్ నెంబర్ అంటున్నాడు.పోలీసులకు చెబుదామంటే ఎక్కడెక్కడికో వెళ్లిపో తున్నాయి.మనం అనుకున్నది అయినట్టులేదు. ఇప్పుడు రిసీవర్ ఎత్తాడు ఉలుకూ లేదు పలుకూ లేదు. ఆ రమేశ్ ట్రయిన్ ఎక్కేస్తాడు. ట్రయిన్‌వద్దనే వాడు అరెస్టు కావాలి.ప్లాన్ పక్కాగా అమలు అయినట్టే.విసుగ్గా పక్కవాడికి చెబుతూనే హలో హలో అని పిలిచి... పిలిచి రిసీవర్ పెట్టేసాడు. ఇన్‌స్పెక్టర్ మరింత ఎలర్టు అయిపోయాడు.

ఇన్‌స్పెక్టర్ సెల్‌లో తను పంపిన పోలీసులకు వివరాలు అందించాడు.అరగంటలో రమేష్ మరోఇద్దరిని పోలీసులు వేన్ ఢించారు. రమేష్‌కు అంతా అయోమయంగా ఉంది. అప్పుడు పోలీసులు ఆ ఇద్దరిని నాలుగు తంతే వారు విషయం చెప్పేసారు.

కాగితంమీద తాను విన్న మర్డర్ గురించి రాసాడు. "జవహర్ కాలనీలో మర్డర్ అయ్యింది. ఇద్దరు అక్కడ సమీపంలో ఉన్న పబ్లిక్‌బూత్ నుంచి మాట్లాడుతున్నారు. మీలో ముగ్గురు నలుగురు వెళ్లి పట్టుకోండి మీరు వెళ్లాల్సింది పెట్రోలింగ్ వేన్‌లో కాదు మోటార్‌సైకిల్‌మీద వెళ్లండి. వారు అరెస్టు అయ్యాక రింగ్ ఇవ్వండి. మీవద్దకు వేన్ వస్తుంది. మరో ఇద్దరు రైల్వేస్టేషన్‌కు వెళ్లాలి. అక్కడ మీకు ఏక్షణమైనా నానుంచి వివరాలు వస్తాయి. వెంటనే అరెస్టు చేయాలి. ఈలోగా జవహర్‌కాలనీకి చెందిన రమేష్ ఎవరన్నది రైల్వేస్టేషన్‌లో ఆరా తీసి అతడిని గుర్తించండి" చెప్పి పంపేసాడు.

అంతలోనే మళ్లీ ఫోన్ మోగింది.రిసీవర్ ఎత్తి "ఎవరు? ఓహ్ మీరా? పోలీసులకు చావుకబురు చెప్పడానికి నన్ను నా నిద్రను పాడుచేస్తున్నారు. ఇక్కడ ఏదో కేబుల్ మార్పు చేసారు. అక్కణ్నించి పోలీసులకు వెళ్లే రింగ్సు నాకు తగలడుతున్నాయి. సాయంత్రం వారి పైఆఫీసర్ ఏదో చెబితే పోలీసులకు చెప్పివచ్చాను. ఏదో ఖూనీ అంటున్నారు. నేను పోలీసులకు చెప్పి సెంటర్‌లోకి పోయి టాబ్లెట్ కొనుక్కొని వస్తాను. కుడిచేయి పీకుతోంది. దీనికి మాత్రవేసుకోంది కుదిరిచావదు" అని పెద్దగా ఆవులించాడు.

"సార్ మీకు శ్రమిచ్చామని అనుకోవద్దు. నోట్ చేయండి సార్. ఇక్కడ జవహర్ కాలనీలో ఆనంద నిలయం అనే భవంతిలో మార్వాడి ధనరాజ్‌ను అతడితో ఇంతవరకు తాగితందనాలు ఆడిన రమేష్ అనే వాడు కత్తితో పొడిచి విలువైన వస్తువులతో నైట్ ట్రయిన్ ఢిల్లీ ఎక్స్‌ప్రెస్‌కు పారిపోతున్నాడు. రమేశ్ పొడుగ్గా పీలగా ఉంటాడు. బ్లూకలర్ షర్టు, బ్లాక్‌ప్యాంటు వేసుకున్నాడు. హత్యాయుధాన్ని కాలువలో పడేసాడు" ఆత్రంగా చెప్పాడు అవతలి వ్యక్తి.

"మీపేరు, మీరెవరు నాకు చెప్పండి" అడిగాడు ఇన్‌స్పెక్టర్.

"సారీ సార్ చెప్పలేను.పోలీసులతో వ్యవహారం కోర్టుల్లో సాక్షిని చేస్తారు.తిరిగితిరిగి చావాలి"

"సార్ ఇన్‌స్పెక్టర్‌గారా? ఇక్కడ జవహర్‌కాలనీలో హత్య జరిగింది. చంపింది ఎవరనేది మాకు తెలుసు. వివరాలు నోట్ చేసుకోండి" మరింత ఆత్రం ఆగొంతులోంచి వెలువడింది. అవతలివైపు నుంచి గొంతులో ఆత్రం గమనించి వెంటనే ఇన్‌స్పెక్టర్ "సారీ ఇది పోలీసుల నెంబర్ కాదు బంగారంలాంటి నిద్ర చెడగొట్టారు"

"ఓహ్ అదీనిజమే నేను ఎవరో ఆకాశరామన్న చెప్పాడు అని పోలీసులకు చెబుతాను. ఒక్క విషయం మీరు ఫోన్‌పెట్టేసి మీదారిన మీరు వెళ్లిపోవద్దు. నేను వెళ్లేసరికి ఠాణాలో పోలీసులు ఇదేదో ఆకతాయి వ్యవహారం అని పొమ్మంటే మీరు అనుకున్నది ఫెయిల్ అవుద్ది. కనుక అక్కడే ఉండండి. మీనెంబర్ ఇక్కడ ల్యాండ్‌కాలర్‌లో పడింది. నేను మాత్ర కొనుక్కొచ్చి ఏవిషయం చెబుతాను" చెప్పి ఫోన్ పెట్టేసాడు.

ఇన్‌స్పెక్టర్ సెల్‌లో తను పంపిన పోలీసులకు వివరాలు అందించాడు.అరగంటలో రమేష్ మరోఇద్దరిని పోలీసులు వేన్ దించారు. రమేష్‌కు అంతా అయోమయంగా ఉంది. అప్పుడు పోలీసులు ఆ ఇద్దరిని నాలుగు తంతే వారు విషయం చెప్పేసారు. "ధనరాజ్‌కు పదిలక్షలు బాకీపడ్డాం. వాడిని చంపితే బాకీ మరిఉండదు అని పథకం వేసాం. ఈరోజు ధనరాజ్ పదిహేను లక్షలు ఇచ్చి ఈరమేష్‌ను పొరుగూరు ట్రయిన్‌కు పంపాలనుకున్నట్లు తెలుసుకుని అక్కడే మాటేసాం. అర్ధరాత్రి రమేష్ నైట్‌ఎక్స్‌ప్రెస్‌కు వెళ్లేందుకు టాక్సీలో వెళ్లాడు. ఒంటరిగా ఉన్న ధనరాజ్‌ను మాఇద్దరం అతడి బెడ్‌రూమ్‌లో చంపేసి ఆహత్యను డబ్బుకోసం చేసాడని రమేష్‌పై పెట్టేయాలని పథకం వేసాం. అంతా బాగానే జరిగింది. ఈఇన్‌స్పెక్టర్ రాంగ్‌నెంబర్ అని మాఫోన్‌లతో మాఆట కట్టించాడు. మమ్మల్ని అసహనంలో పడేసి గుట్లు పీక్కున్నాడు. ఫలితంగా పథకం బెడిసింది. పోలీసు వలకు చిక్కిపోయాం" అని ఇద్దరిలో ఒకడు వాపోయాడు.

ఇన్‌స్పెక్టర్ నవ్వేసి "మెదడు షార్పుగా పెట్టగలిగాను. ఇలాంటి హత్యల్లో వెంటనే పోలీసులకు ఇన్‌ఫర్‌మేషన్ ఇచ్చేవాళ్లు అందులో ఎక్కువశాతం ఇన్‌వాల్వ్ అయ్యేవారుంటారు. రాంగ్‌నెంబర్ అని చెప్పి హంతకులను పట్టుకున్నాను. ఎక్కడకి పోకుండా, కూర్చున్న సీటులో లేవకుండా హంతకుల్ని పట్టుకున్నాను" చెప్పి కుర్చీలోంచి లేచాడు.

★

# కంప్యూటర్ - జాగ్రత్తలు

**కంప్యూటర్ ఉపయోగించేవారి సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. కార్యాలయాల్లోను, ఇళ్లల్లోనూ... కంప్యూటర్ తప్పనిసరి అనేవారూ ఎక్కువవుతున్నారు. దాంతోపాటే వృత్తి రుగ్మతలు కూడా వెన్నంటే వుంటాయని మరువకూడదు. కంప్యూటర్ ముందర అధిక సమయం వెచ్చించేవారికి వచ్చే ఆరోగ్య సమస్యల్లో కళ్లు త్వరగా అలసిపోవడం ప్రధానమైనది. దీనికి సంబంధించి చేసిన పలు అధ్యయనాలు ఇదే విషయాన్ని చెప్తున్నాయికూడా. కంప్యూటర్‌తో పని చేసే వారిలో 50 నుంచి 90 శాతం మంది ఈ సమస్యతో ఇబ్బందిపడుతుంటారుకూడా. అయితే దీన్ని ఇలాగే నిర్లక్ష్యం చేస్తే ఇతర శారీరక సమస్యలకు దారితీయవచ్చు. పనిలో చురుకుదనం తగ్గవచ్చు. తప్పులు జరగవచ్చు. పనిలో ఫలితాలు తగ్గే అవకాశం వుంది. ఈ సమస్యలను నివారించడానికి కొన్ని సూచనలు, సలహాలు.**

కంటి సమస్యల పరిష్కారానికి, నివారణకు తప్పనిసరిగా కంటిపరీక్ష చేయించుకోవాలి. కంప్యూటర్ మీద పనిచేసేవారు సంవత్సరానికోసారి కళ్లు చూయించుకోవాలి. ఇందులో ఏమాత్రం నిర్లక్ష్యం కూడదు. అయితే ఇంట్లోగానీ, కార్యాలయంలోగానీ మీరు ఎంతసేపు కంప్యూటర్ వాడతారో డాక్టర్‌కి తప్పనిసరిగా చెప్పండి.

**వెలుతురు సరిపడా వుండాలి**

మీరు పనిచేసే గదిలో వెలుతురు సరిపడా వుండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. అది కిటికీ నుంచి వచ్చే వెలుతురైనా కావచ్చు. లైట్ల వెలుగైనా కావచ్చు. మన కంటికి సరిపడా వుండాలి.

**ప్రతిబింబం పడకుండా చూసుకోవాలి**

కంప్యూటర్ స్క్రీన్ మీద వస్తువుల ప్రతిబింబాలు పడకుండా చూసుకోవాలి. గదిలో లైటు కూడా కంప్యూటర్ స్క్రీన్ మీద పడకూడదు. వీటివల్ల కూడా కళ్లు త్వరగా అలసిపోతాయి. వీలైతే యాంటీ గ్లేర్ స్క్రీన్‌ను ఏర్పాటు చేసుకోవాలి. కిటికీలకు కర్టెన్లు వేసుకోవడం మరువవద్దు. దీనివల్ల ప్రతిబింబాలు మానిటర్ మీద పడవు. మీరు కళ్లజోడు వాడుతుంటే మాత్రం అద్దాలకు యాంటీ రిఫ్లెక్టివ్ కోటింగ్ వుండేలా చూసుకోండి.

**ఫ్లాట్ మానిటర్**

కంప్యూటర్ మానిటర్ ఫ్లాట్‌గా వుంటే మంచిది. కంప్యూటర్ స్క్రీన్ బ్రైట్‌నెస్, కాంట్రాస్ట్‌ను సరిచేసుకోవాలి. అలాగే స్క్రీన్ సెట్టింగ్స్‌ను కూడా మనకు అనుకూలంగా మార్చుకోవాలి. అలాగే టెక్స్ట్ సైజు, రంగు కూడా మనకు వీలుగా వుండేట్లు చూసుకోవాలి.

**టెక్స్ట్ సైజ్**

మనం మామూలుగా చదవగలిగే అక్షరం సైజుకు మూడింతల పెద్దగా టెక్స్ట్ సైజు పెట్టుకోవాలి. ఇది మన కళ్లు అలసిపోకుండా కాపాడుతుంది.

**తరచూ కళ్లు ఆర్పుతుండాలి**

కంప్యూటర్ మీద పనిచేసేవారికి కళ్లు ఆర్పడమనేది చాలా ముఖ్యమైన విషయం. దీనివల్ల కంటి తడి ఆరకుండా వుంటుంది. అలాగే విసుగు రాకుండా నివారిస్తుంది. కంప్యూటర్ మీద పనిచేసేటప్పుడు మామూలుగా కంటే తక్కువగా కళ్లార్పుతుంటామని ఓ అధ్యయనంలో తేలింది.

**కంటి వ్యాయామం**

ప్రతి 20 నిముషాలకు ఒకసారి పదిసార్లు కళ్లు ఆర్పాలి. దీనివల్ల కళ్లు తిరిగి తడిగా అవుతాయి.

కంప్యూటర్ స్క్రీన్‌కి మరీ దగ్గరగాను, దూరంగాను కూర్చోకూడదు. అలాగే లైటింగ్ కూడా మరీ ఎక్కువగాను, మరీ తక్కువగాను వుండకూడదు.

కంప్యూటర్ దగ్గర పనిచేసేటప్పుడు మధ్య మధ్యలో విరామం తీసుకుంటుండాలి. దీనివల్ల మెడ, వెన్ను, భుజాల నొప్పులు రాకుండా నిరోధించవచ్చు.

ఎక్కువమంది రోజంతటికీ కేవలం రెండుసార్లు మాత్రమే 15 నిముషాల చొప్పున విరామం తీసుకుంటుంటారు. కానీ ఇలా ఒక్కసారిగా 15 నిముషాలపాటు విశ్రాంతి తీసుకునేకంటే 5 నిముషాల చొప్పున అదనంగా నాలుగుసార్లు విరామం తీసుకుంటే పనిలో మెరుగైన ఫలితాలు వస్తాయని ఎన్ఐఒఎస్‌హెచ్ అధ్యయనంలో తేలింది.

అలాగే కంప్యూటర్ ముందు కూర్చోవడానికి వాడే కుర్చీ ఎత్తు కూడా మానిటర్‌కు సరిపడా వుండాలి. లేకపోతే ఇతర ఇబ్బందులు వస్తాయి.

★

## చూద్దామా



గుజరాత్‌లోని కైరా నుంచి 65 కిలో మీటర్ల దూరంలో వుంది లోథాల్. దారిలో చిన్నపల్లెలో బహు పురాతనమైన కాళీమాత ఆలయం ఉంది. చాలా ప్రసిద్ధికెక్కినది. ఆలయంలో వెండితో మలచిన ఏనుగుమీద కాళీమాత విగ్రహముంది. ఇదొక అసాధారణ ప్రయోగం. కాళీమాత విగ్రహాన్ని సౌందర్యం రాసి పోసినట్లు మలచారు. ఇక్కడీమెను "భూత్ మా" అంటారు. ఏనాటిదో ఇది. ఏ శాఖకు చెందినదో! ఎన్ని సాంప్రదాయాలీ దేశంలో!

# తొలి నాగరికత లోగిలి లోథాల్

**లో**థాల్ కచ్ జిల్లాలో వుంది. 1955 -62వ మధ్య ఇక్కడ జరిగిన తవ్వకాలలో బయల్పడిన విశేషాలేమంటే ఇక్కడ హరప్పా మొహంజదారో నాగరికతలకు సమకాలీనంగా అదే నాకగికత వెల్లివిరిసింది. ఆ నగరాలు అంతరించిన తరువాత కూడా కొనసాగింది. ఆ నగరాలిప్పుడు పాకిస్తాన్‌లో వున్నాయి. చరిత్రకందని కాలంలో వికసించిన మానవజీవనసరళి, దాని అవశేషాలూ చూడాలని ఎవరికి మాత్రం అనిపించదు? నాలుగువేల సంవత్సరాలనాటి భౌగోళిక స్వరూపం కొంత వేరుగా వుండేదనుకుంటా. అప్పటి అరేబియా సముద్రం ఇక్కడికి దగ్గరగానూ, భోగవతినది నగరానికి పశ్చిమభాగాన వుండేవట. ఇప్పుడీనది ఇక్కడకు 3 కిలో మీటర్ల దూరంలో ప్రవహిస్తుంది. ఇది సబర్మతి నదితో సంగమించి అరేబియా సముద్రంలో కలుస్తుంది. ఈ నది ప్రవాహమార్గం మార్చుకోవటం వల్ల, ఆనాటి నగరవాసులు, అరేబియా సముద్రం నుంచి అతివిశాలమైన కాలువలు తవ్వి, సముద్రం పోటులో వున్నప్పుడు ఓడలను ఈ కాలువ ద్వారా లోథాల్‌కు తెచ్చేవారట. ఇక్కడినుంచి విదేశీవ్యాపారం విస్తృతంగా జరిగింది. హరప్పా మొహంజదారోలో తయారయిన వస్తువులు కూడా లోథాల్ నుంచే ఎగుమతి అయ్యేవి. సుమేరియా, పర్షియన్ సింధుశాఖ తీరాన వెలసిన నగరాలతో వాణిజ్యం జరిగేది. ఈ విధంగా ఆనాడు వెల్లివిరిసిన నాగరికతల మధ్య సంబంధ బాంధవ్యాలకు లోథాల్ ఒక సాగర గవాక్షంగా నిలచింది. అందుకే మొహంజదారోలో తయారయిన ముద్రికలు (సీల్స్) బాబిలోనియాలో లభ్యమైనాయి. లోథాల్‌లో లభించిన తూనికరాళ్ళు తులారాసుల వల్ల, విదేశీ ఎగుమతుల నాణ్యత, పరిమాణం ఇక్కడ నిర్ధారించి గోదాముల్లో నిల్వచేసేవారని, ఇక్కడ మట్టిపెళ్ళలలో వరిపొట్టు వుండటాన్నిబట్టి ఇక్కడ వరి సాగు చేసేవారని తెలుస్తుంది. వ్యవసాయం వరద నీటిపై ఆధారపడగా, ఆ ప్రాంతాలలోనే జనావాసాలు వెలిశాయి. పాడిపంటలు, పట్టణప్రాంతాలకు సరఫరా చేసేవారు. హరప్పా, మొహంజదారో, విస్తృతమైన నగరాలైనప్పటికీ, వారి విదేశీ వ్యాపారం లోథాల్ నుంచే జరిగింది. ఇదికూడా ఆనాడు చక్కని ప్రణాళికాబద్ధంగా నిర్మించిన నగరమే. నౌకాశ్రయానికి చేరువలోనే చాలా పెద్ద గిడ్డంగులు సువిశాలమైన రాజవీధి ఉన్నాయి. నివాసగృహాలు, కార్ఖానాలు వేరు వేరు నిర్దేశిత ప్రాంతాలలో ఉన్నాయి. ముఖ్యంగా ఇక్కడ ఉన్నా భూగర్భజలమార్గం అనాటికే వారికి సుపరిచయం అంటే ఆశ్చర్యమనిపిస్తుంది. ఇటుకలతో దీన్ని నిర్మించి అక్కడక్కడ మనిషి పట్టేటంత గోతులతో ఏర్పాటు చేశారు. అన్ని కట్టడాలు ఎత్తయిన పునాదిపై







  

నిర్మించారు.

సుమారు 4 వేల సంవత్సరాలనాడే సముద్రాన్ని భూతలానికి రప్పించి, సుదూర దేశాలకు సముద్రయానం చేసి, వారితో వర్తక వాణిజ్యాలు సాగించారంటే, దీనిముందు మనం వాస్కోడిగామా గురించి, 15వ శతాబ్దపు నివాసాల గురించి ఆశ్చర్యంగా చెప్పుకునే సంఘటనలు ఏపాటివి! ఆనాటి నగరవాసులు గిడ్డంగులను కూడా ప్రతికూల పరిస్థితులకు తట్టుకునేలా, ఎంతటి చాతుర్యంతో తీర్చిదిద్ది, తమ జీవనశైలి వైభవోపేతం చేసుకున్నారో!

వారు గిడ్డంగులలో సరుకు నిల్వచేసిన పద్ధతి ఆశ్చర్యకరంగా ఉంటుంది. ఇక్కడ లభించిన ముద్రికలు ఆయా వస్తువులు తయారైన ప్రదేశం, వారి వాణిజ్యనామం లాంటి వాటికి సూచికలు. ఏ దేశంలో ఏఏ వస్తువులు తయారైనాయో తెలిపే ముద్రికలు 15 రకాలు లభించాయి. అంటే ఇక్కడ వస్తువుల పరిమాణం, నాణ్యత నిర్ధారించి, అవి తెలిపే సీళ్ళు వేసి వేటికవి వేరువేరుగా భద్రపరచేవారన్నమాట. ఇన్ని రకాల ముద్రికలు, వారి వ్యాపారం ఎంత విస్తృతంగా వుండేదో తెలియజేస్తాయి.

ఈ గిడ్డంగి సమీపాన ఓడలు నిలిచే డాక్ వుంది. సముద్రపుపోటు ఆధారంగా నౌకలు రావటానికి ఏర్పాటు చేశారు. ఎంత బలంగా ఈ గోడ నిర్మించారో! సముద్రం నుంచి తవ్వుకు వచ్చిన విశాలమైన నీటిమార్గాన్ని కూడా ఇప్పుడు వెలికితీశారు. దీనికి ఆవలి దిశగా రాజభవనం ఉండేదట. ఇప్పుడు శిథిలమైన స్నానశాలలు మాత్రం బయటపడ్డాయి. ఈ శిథిలాల మధ్యనున్న దిబ్బ ఎక్కిచూస్తే, మొత్తం నగర నిర్మాణం నాలుగువైపులా కనిపిస్తుంది. ఇదొక అద్భుతమైన ప్రణాళిక. మానవమేధకు కలికితురాయి. డాక్ నుంచి దూరంగా వెలితే, ఇక్కడ లోతట్టు నగరం వుంది.

బజార్లు, కర్మాగారాలు, నివాసగృహాలు వేరువేరు సముదాయాలుగా, వేరువేరు దిశలలో చక్కని అమరికతో, నిర్దిష్టమైన ప్రణాళికతో, ఈనాటికీ ఎక్కడో కాని కనిపించవు. ఇక్కడ కంచుతో వస్తువులు తయారుచేసే కర్మాగారం ఒకటి బయటపడింది. దీనిచుట్టూ కంచె ఏర్పాటు చేశారు. ఇక్కడున్న పెద్ద కుండలాంటి పరికరాన్నే కొలిమిగా ఉపయోగించేవారట. ఒక పక్కగా, గాలితిత్తి వేసి అగ్నిప్రజ్వలింపజేసి వస్తువులను తయారు చేసేవారు.

అంతేకాక వీరు పూసల తయారీలో బహునేర్పరులు. ఇక్కడ తవ్వకాలలో పూసలు బహువిరివిగా లభించాయి. బంగారు, వెండి పూసలతో పాటు, మట్టి, దంతపు పూసలమీద చక్కని అలంకరణలద్దేవారు. నూలు వస్త్రాలకు రంగురంగుల అలంకరణలద్ది ఎగుమతి చేసేవారు. సముద్రాలకావల, ఆనాటి సమకాలీన నాగరికతలతో, ఇంత విస్తృతంగా వ్యాపారం సాగించారంటే వారి సముద్రయాన సాంకేతిక ప్రావిణ్యాన్ని ఊహించుకోవచ్చు. వాటి వివరాలు బయటపడితే ఇంకెన్ని అద్భుతాలు తెలుస్తాయో!

వీరి కళాభిరుచి కూడా విశిష్టమైనదే. ఇక్కడ లభించిన స్త్రీమూర్తి, ఎర్రమట్టితో చేసిన ఎద్దులు, కుక్క, ఎలుగుబంటి, నెమలి, ఖడ్గమృగం లాంటివి వారి కళానైపుణ్యానికి నిదర్శనం. ఇక్కడి ముద్రికల మీద కూడా ఈ బొమ్మలుంటాయి. ఈ ముద్రికలమీది లిపి ఇంతవరకూ అవగాహనకు రాలేదు. ఇక్కడ కనిపించిన బలిపీఠాలను చూస్తే, వీరు బలులివ్వటం సాధారణమని, అగ్నిని సేవించేవారనీ తెలుస్తుంది. చనిపోయిన వారిని సమాధి చేయటం విచిత్రంగా వుంది. ఒక్కొక్కచోట ఇద్దరిని సమాధి చేయటంచూస్తే, సహగమనం వారి ఆచారమని తెలుస్తుంది. ఇక్కడ లభించిన అస్థిపంజరాన్ని మ్యూజియంలో భద్రపరిచారు. ఆనాటి నాగరిక మానవుడు ఈ రూపంలోనైనా దర్శనమిస్తాడు. ఇలా ఈ భూగర్భంలో ఎన్నెన్ని అద్భుతాలు దాగున్నాయో! ఇక్కడున్నంత సేపూ 4 వేల సంవత్సరాల కాలపు పొరలలో చిక్కుకుంటుంది మనస్సు. వేలాది సంవత్సరాలుగా మానవుని ఈ అనంత జీవయాత్ర సాగుతూనే ఉంది. ఎన్ని ఉపద్రవాలు! అంతరించిపోయిన నాగరకతలు, యుగాంతాలు, యుగారంభాలు కాలమనే ఈ ప్రవాహంలో కదలిపోతూనే ఉంటాయి. వీటిని దాటుకుంటూ మానవ జీవనం సాగిపోతూనే ఉంటుంది. ★



Anలోథాల్ మ్యూజియం
Lot

కొత్త పుస్తకాలు

# రచయితలకు పాఠ్యగ్రంథం




పరిచయం
కేతు విశ్వనాథరెడ్డి
పేజీలు: 184
వెల: 80/-
ప్రతులకు: విరాట్ కమ్యూనికేషన్స్.

అన్నింటినీ సహేతుకంగా సూక్ష్మకోణంలో పరిశీలిస్తూ క్షీరనీర న్యాయం చేస్తూ, యుక్తా యుక్త విచక్షణతో వివేచనా పూర్వకమైన అమృతసారాన్ని అందించడమే విమర్శకుల పని. సాహితీరంగంలో విమర్శను ప్రాణప్రద బాధ్యతగా నమ్మి నిరంతరం శ్రమిస్తున్న పథికుడు శ్రీకేతు విశ్వనాథరెడ్డి, సాహితీవిమర్శ అంటే అందంగా వెండితెరపై చదివించే ఫొటోగ్రఫీ కాదు. ఎక్కడికక్కడికి పీకి పాకం పెట్టే శల్యపరీక్ష అంతకన్నా కాదు. క్షీరసాగరమదనంలో గరళాన్నీ - అమృతాన్ని వేరు చేసి చూపడంతో పాటు, ఎప్పుడు ఎక్కడ ఎంత మోతాదులో ఎలా చేస్తే గరళం కూడా పరిణామం నుండి గుణాత్మకతకు చేరి అమృతపానం అవుతుందో తెలియజెప్పాలి. అలాంటి ఓర్పును -నేర్పును కేతు మార్క్సిజం ద్వారా సాధించుకున్నారు. అందుకే.... కేతు విశ్వనాథరెడ్డి మార్క్సిజాన్ని ఒక ప్రాపంచిక దృక్పథంగా ఏర్పరుచుకుని దాని ప్రకారమే చారిత్రక దృష్టితో తెలుగు కల్పనా సాహిత్యాన్ని అనేక ముఖాలనుంచి విశ్లేషించారు. తెలుగు సాహిత్యాన్ని అంతకుముందు భావజాలాల కన్నా మార్క్సిజమే జీవితానికి దగ్గరగా తీసుకువచ్చిందని 1921 ప్రాంతాల నుండి అది ఎలా సాధ్యమైందో తన వ్యాసాలతో విశ్లేషించారని' ప్రచురణకర్తలు పేర్కొన్నారు. మంచితనాన్ని ఒక సంపదగా పోగుచేయడం, ప్రజలకు పంచడంతో పాటు సామాజిక అవసరాల కనుగుణంగా శ్రమించి ఉత్పత్తి చేయడం కూడా మార్క్సిజంలో భాగమే. ఈ విధంగా కేతు మన తెలుగు సాహితీ రంగంలో అచ్చమైన మార్క్సిస్టు విమర్శకులుగా గణతికెక్కారు. వివిధ పుస్తకాలకు రాసిన ముందు మాటలు కొన్నింటిపై రాసిన సమీక్షలు 'పరిచయం' పేరుతో పుస్తకంగా తీసుకొచ్చారు.

ముప్పై రెండు ముందు మాటలు, ముప్పై ఆరు సమీక్షలు ఉన్నాయి. ఔత్సాహిక రచయితలకు ఇదో పాఠ్యగ్రంథం. రుచి చూసి కూరను ఎలా పసిగట్టవచ్చో ముందు మాటను చదివి సంగ్రహాన్ని కొంత గ్రహించవచ్చు. రచయిత స్వభావాన్ని కొంత అర్థం చేసుకోవచ్చు. ఈ క్రమంలో స్ఫూర్తి ప్రధానమైనవి, కర్తవ్యోన్ముఖులను గావించేవి, ఉత్సాహపరిచేవి, ఆలోచనకు పదును పెట్టేవి, వివేకానంద భరితుల్ని చేసేవి లభిస్తాయి. అన్నింటికీ మనం వెళ్ళలేకపోయినా అవే మనింటికి ఈ పుస్తకం ద్వారా 'పరిచయం' చేసుకొని పలకరించి పోతాయి. ఇది నార్ల శతజయంతి వత్సరం. శాస్త్రీయ చైతన్య సమిష్టి జీవనం ఆయన (నార్ల) మార్గం శీర్షిక కళల స్వరూపాన్ని, స్వభావాన్ని ప్రజాజీవిత క్రమం నిర్ణయిస్తుందని నార్ల రచనల ద్వారా భావిస్తామని తెలిపారు.

"మతోన్మాదం ఎంత ఖండించదగిందో భాషోన్మాదం కూడా అంతే ఖండించదగింది. మత విభేదాలపై ఆధారపడిన రాజకీయాలు అంతే గర్హించదగినవి"- ఈ కారణంగా నార్ల భాషలను రాజకీయ ప్రయోజనకారులుగా చూడలేదు. చారిత్రక దృష్టితో చూశారు. తులనాత్మకంగా పరిశీలించారు" అని కేతు పేర్కొన్నారు. సైంటిఫిక్ టెక్నిక్ మాత్రమే స్వీకరించి స్పిరిట్‌ను తోసి వేయడం జాతి ప్రగతికి భవిష్యత్‌కు ప్రమాదమని నార్ల త్రికరణశుద్ధిగా నమ్మారని వివరించారు. గజ్జల మల్లారెడ్డిది విశిష్టమైన కవితా కంఠస్వరమని శ్లాఘిస్తూ గౌరవ నిర్మాణంలో మల్లారెడ్డి అలవోకతనాన్ని, సహజత్వాన్ని ఎత్తి చూపారు. 'ముందుమాట'లో విశాలాంధ్ర-2000 నవలల పోటీకి ఆశించిన మేర నవలలు రాలేదని వాపోయారు. తెలుగు నవలా సాహిత్యంలో ఇతివృత్త నిర్మాణం ఒక రచనా కళగా నశించి పోతుందా? అని ఆవేదన వ్యక్తం చేశారు. ఐతే సాహిత్యాన్ని ఒక ఉద్యమ స్వరూపంగా చేపట్టవలసిన ఆవశ్యకతను గుర్తించకపోవడమే ఇందుకు కారణమని అప్పుడు పేర్కొనలేకపోయారు. విలక్షణమైన వ్యాసకర్త -సోదుం రామ్మోహన్‌కు వ్యాసాలు రాయడం నీళ్ళ చెర్లాటం (మంచినీళ్ళ ప్రాయం అనుకోవచ్చు) వంటిదని అభిప్రాయపడ్డారు. 'ఎక్కువ బరువు లాగడం కాదు ముఖ్యం. ఎక్కువ బరువును అవలీలగా లాగే ఎద్దు మొగోడు - ఈ శ్రమ సత్యాన్ని ఆయన జీర్ణించుకున్నట్లు వివరించారు. చందు సుబ్బారావును జ్ఞానం, అనుభవం, సృజన శక్తిగల రచయితగా అభివర్ణించారు. శృంగారం, ప్రేమ సంబంధాలకు మురిసిపోయేవాళ్ళు ఈ సంబంధాల వెనుక ఉండే సామాజిక గతిశీలతను వాస్తవికతావాద లక్షణాలను అలోచించే పాఠకులు చందులోని చలం కుటుంబరావుల చిన్న నవలల బాణీని తీవ్రంగా పట్టించుకొంటారని తెలిపారు. భాష సాహిత్యాలపై పరిశీలన చేసేవారికి బాషలు తెలిసి ఉండటమే కాదు భాషలోని సాహిత్యంతోను ఆ సాహిత్య వికాసానికి కారణమైన సామాజిక చరిత్రతోను, ఆ చరిత్ర గతి సూత్రాలతోను తగిన పరిచయాలు ఉండి తీరాలని ఘంటాపథంగా చెప్పారు. మాలపల్లి, గోదాన్ నవలల తులనాత్మక పరిచయం నునుమాస్వామి వాంఛనీయ ప్రయత్నంలో తెలిపారు. దారి దొరకని 'ముళ్ళ పొదలు'గా నవీన్ నవలను విమర్శించారు. జీవిత వాస్తవాన్ని చిత్రించడంలో విఫలమై వాస్తవ జీవితాన్ని చిత్రిస్తే రచన దెబ్బతింటుందని చెప్పారు. ఇంకా ముందుకు వెళ్ళి సామాజిక ప్రయోజనం లేని దృక్పథం జీవిత వాస్తవికతను ప్రతిబింబించదనే శాస్త్రీయ లోపాన్ని (మార్క్సిజం శాస్త్రం కనుక) చూపెడతారు. ఇతివృత్తానికి - శిల్పానికి సమన్వయం పొందిక సాధించడంలో నవీన్ పూర్తిగా కృతకృత్యుడు కాకపోవడం వలనే ఈ నవల కళారూపం కాలేక పోయిందని వివరిస్తారు (1976లో). మహాదార్శనికుడు (ఖలీల్ జిబ్రాన్ ది ప్రాఫెట్) లో జిబ్రాన్ భావాలు వర్గ సమాజంలో అలసిన వాళ్ళను ఇహలోక జీవితంలోంచి పారిపోవాలనుకునే ప్రతి ఒక్కరినీ ఊపి పారేస్తాయని పేర్కొంటారు. 'నేటి కథ'ను ఆశవహ ప్రయోగమని అభివర్ణిస్తూ సంపాదకుడు శ్రీ కాళీపట్నం రామారావు అన్నట్లు చెడ్డరోజులు వచ్చాయని ఎవరూ చచ్చిపోరు. చచ్చిపోరాదు. మంచిరోజులుగా మార్చుకోవడానికి ప్రయత్నించాలి. ఇతివృత్తానికి శిల్పానికి మధ్య ఉండే సజీవ సంబంధం కాళీపట్నంకు తెలుసునని చెప్పడానికి కూర్పు ఓ ఉదాహరణగా చెప్పారు. ఇలాంటి విలువైన వచనాలు ప్రతి వ్యాసంలో దర్శనమిస్తాయి. తద్వారా ఆ పుస్తకాలను చదవాలని కోరిక పుడుతుంది. సింహద్వారాన్ని తడమగానే ఆ ఇల్లే మనల్ని సాదరంగా లోపలికి పిలిచిన అనుభూతి కలుగుతుంది. 'పరిచయం' చదివిన తరువాత మన చుట్టూ ద్వారాలు నిలబడతాయి.

- శైలి

# సొరకాయ బొమ్మలు

అడవి మనుషులు, జపాన్ అమ్మాయి, సాగర కన్య, నాగరికత ఉట్టిపడే అమ్మాయి, అధికారి, శునకరాజం... చూస్తుంటే 'భలే వున్నాయ్' అనిపిస్తోంది కదూ. వీటన్నింటినీ మనకు సులభంగా అందుబాటులో ఉన్న వస్తువులతోనే చేశారంటే గబుక్కున నమ్మబుద్ధికాదు. సొరకాయ డొల్లలు, అరటి ఆకులు, పువ్వులు, గడ్డి, గవ్వలు, పెయింట్లతోనే చక్కటి బొమ్మలు తయారు చేసేశారు. కాకపోతే కావలసిందల్లా కూసింత సృజనాత్మకత... సహనం. అంతే!



# కుందేలు తెలివి

- కె. సాహిల్

అనగనగా ఒక అడవి. అద్భో ఇది చాలా పెద్దది. ఇందులో బోలెడన్ని జంతువులు నివసించేవి. వాటిలో సింహం కూడా వుంది. ఇది ఆకలేసినప్పుడల్లా వేట ఆడుతూ కనిపించిన జంతువునల్లా పట్టుకుని చంపి తినేసేది. అడవిలో ఏ రెండు జంతువులు ఎదురుపడినా ఇదే విషయం మీద చర్చ నడిచేది. అలాగైతే కొంత కాలానికి తామెవరం ఈ భూమి మీద కనిపించమని కూడా అనుకునేవి. అయితే ఈ ఘోరాన్ని ఆపడానికి ఏదైనా ఒక ఉపాయం ఆలోచించాలని జంతువులన్నీ అనుకునేవి.

ఓరోజు జంతువులన్నీ కలిసి ఒక సమావేశం ఏర్పాటు చేసుకున్నాయి. మాట్లాడుకున్నాయి. ఒక నిర్ణయానికొచ్చాయి. ఆ మరునాడు అవన్నీ కలిసి సింహం దగ్గరకు వెళ్లాయి. అన్ని జంతువులను ఒక్కసారిగా చూసేసరికి దానికి పట్టలేని ఆనందం కలిగి పెద్దగా గర్జించింది. అన్నిటినీ ఒక్కసారి చంపేస్తే మాటిమాటికీ అడవిలోకి వేటకెళ్లే బాధ తప్పుతుందన్న ఆలోచన కూడా దాని మనసులో ఒక్కసారి మెరిసింది. ఈలోగా...

"ఏవండీ సింహం గారూ! మీరు మమ్మల్ని చంపబోయే ముందు మేం ఓ మాట చెప్పాలనుకుంటున్నాం. దయచేసి వింటారా! మీరు మా మహారాజు. మేం మీ సేవకులం. మీరు ఈ విధంగా మమ్మల్ని చంపుకుంటూ పోతే ఏదో ఒకనాటికి మీరు ఒక్కరే మిగులుతారు. మేమెవరం వుండం. సేవకులు లేకుండా రాజుగారు ఎలా రాజ్యాన్ని పాలిస్తారు? మేం మాత్రం మా రాజుగారు ఎప్పటికీ వుండాలని కోరుకుంటున్నాం. అందుకు ఒక ఉపాయం కూడా వుంది. మేం ఏమంటున్నామంటే రాజా! మీరు మీ గుహలోనే వుండండి. దాన్ని వదిలి అస్సలు బయటకు రాకండి. మేం మాత్రం రోజుకు ఒకరం వచ్చి మీకు ఆహారమవుతాం. వేటాడకుండానే ఆహారం అందుతుందన్నమాట మా రాజుగారికి. అలా రాజుగారు, భటులు సుఖంగా జీవిస్తారన్నమాట" అంది ఓ జంతువు చాలా వినయంగా నమస్కరించి.

ఆ జంతువు చెప్పిన విధానం సింహానికి బాగా నచ్చింది. పైగా జంతువులన్నీ కలిసి చేసిన సూచన కూడా దానికి బానేవున్నట్టనిపించింది. కదలకుండా గుహలో వుండడం...రోజూ తమంతట తాముగా వచ్చి జంతువులు తమను తాము ఆహారంగా సమర్పించుకోవడం అన్న ఆలోచనే సింహానికి తమాషాగా, గమ్మత్తుగా అనిపించింది. ఎండలో పడి అడవంతా తిరగాల్సిన అవసరమే వుండదు. ఎంచక్కా గుహకు వచ్చిన జంతువును తినడం, కునుకు తీయడం. ఎంత బావుంటుందో జీవితం అనుకుంది సింహం.

లోలోన తెగ సంతోషపడిపోతూనే...పైకి మాత్రం గంభీరంగా "సర్సరి. ఏదో మీరందరూ బతిమాలుతున్నారు కాబట్టి... మీ సూచనను అంగీకరిస్తున్నాను. కానీ ఒక్క విషయం మాత్రం గుర్తుంచుకోండి. ఏరోజైనా నాకు ఆహారాన్ని పంపడంలో నిర్లక్ష్యం వహించారో... మీకు మూడిందే. నాకిష్టమొచ్చినట్టు అడవిమీద పడి జంతువులన్నిటినీ చంపి పడేస్తాను. సరేనా" అంది.

జంతువులన్నీ ఎంతో వినయంగా తలలు వంచి చెప్పినట్టే చేస్తామని వాగ్దానం చేశాయి.

✦✦✦

ఆరోజు నుంచి రోజుకో జంతువు సింహం గుహకు ఆహారంగా వస్తోంది. అలా చాన్నాళ్లు గడిచిపోయాయి. ఈ దఫా కుందేళ్ల వంతు వచ్చింది. ఒక చిన్నారి కుందేలును ఆహారంగా వెళ్లమని చెప్పాయి మిగతా కుందేళ్లు. ఆ కుందేలు మహా తెలివిగలది. సింహం తనను ఆహారంగా తినేస్తుందన్న ఊహే దానికి నచ్చదు. తన ప్రాణాలను, వీలైతే ఇతర జంతువుల జీవితాలను కూడా కాపాడడానికి ఏదైనా ఉపాయం వుందేమోనని ఆలోచించసాగింది. అలా చాలా సేపు ఆలోచించి ఒక పథకం వేసింది.

కుందేలు సింహం గుహ దగ్గరకు వెళ్లింది. అయితే ఏమాత్రం కంగారుపడకుండా నిదానంగా...కావాల్సినంత సమయం తీసుకుంటూ...అడుగులో అడుగు వేసుకుంటూ వెళ్లింది.

కుందేలు గుహ చేరేసరికి సింహం మాంచి ఆకలిమీదవుంది. తనకు ఆహారంగా వచ్చిన చిన్ని కుందేలుని చూసి దానికి కోపం మరింత పెరిగింది.

"నిన్ను ఇక్కడకు ఎవరు పంపారు? ఆహారంగా స్వీకరించడానికి నువ్వు చాలా చిన్నగా వున్నావు. పైగా బాగా ఆలస్యంగా వచ్చావు. మీ జంతువులన్నిటికీ ఒక గుణపాఠం చెప్పాల్సిందే. వాటన్నిటినీ చంపిపడేస్తాను" అంది గర్జిస్తూ.

(అప్పుడు కుందేలు ఏమని సమాధానం చెప్పింది? అసలు కుందేలు సింహానికి బలైపోయిందా? తప్పించుకుందా? ఇతర జంతువులేమయ్యాయి? వాటిని కుందేలు కాపాడగలిగిందా? వంటి ఆసక్తికర విషయాలు తెలియాలంటే...వారం రోజులు ఆ...గా..ల్సిం...దే)